www.prajavinikidi.com RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -29 గురువారం14 మే 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్

**తమిళనాడు అసెంబ్లీలో 144 మంది మద్దతు**

**విశ్వాస పరీక్షను బహిష్కరించిన డీఎంకె**

**అనాడిఎంకె చీలిక వర్గం టివికెకు అనుకూల ఓటు**

**ప్రజల విశ్వాసాన్ని కాపాడుకుంటామన్న సిఎం విజయ్**



**చెన్నై, మే 13,(ప్రజావినికిడి):**
తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ తన బలాన్ని నిరూపించుకున్నారు. బుధవారం జరిగిన బలపరీక్షలో 144 మంది ఎమ్మెల్యేలు అధికార టీవీకే పార్టీకి అనుకూలంగా ఓటు వేశారు. మరో 22 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. ఐదుగురు ఎమ్మెల్యేలు తటస్థంగా ఉన్నారు. ఈ సందర్భంగా మూజువాణి ఓటుకు బదులుగా స్పీకర్ సభలో ఒక్కో సభ్యుడి మద్దతు గురించి అడిగి తెలుసుకుని వారి ఓటును మిగతా 2లో...

## ఖరీఫ్ సీజన్‌లో14 పంటలకు మద్దతు ధర పెంపు

**ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం**

**రైతుల సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కీలక నిర్ణయాలు**

**క్వింటాల్ వరికి రూ. 2,441గా మద్దతు ధర**



**న్యూఢిల్లీ మే 13,(ప్రజావినికిడి):**
2026-27 మార్కెటింగ్ సీజన్‌లో 14 పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)ను పెంచడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. బుధవారం ప్రధాని మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో పశ్చిమాసియా సంక్షోభం, పెరుగుతున్న గ్లోబల్ ఆయిల్ రేట్స్, ఇంధన సంరక్షణ, వర్క్ ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ క్లాసెస్, బంగారం కొనుగోళ్ల వాయిదాపై చర్చించినట్టు సమాచారం. మిగతా 2లో...

## నేడు ఎపి కేబినేట్ భేటీ పలు కీలక అంశాలపై చర్చ



## 15న ఆధారాలతో విచారణకు వస్తా పోలీసులకు బండి భగీరథ్ లేఖ



## నీట్ ప్రశ్నాపత్రం లీక్ కేసులో కదులుతున్న డొంక

**రూ.30 లక్షలకు నీట్ ప్రశ్నాపత్రం కొనుగోలు!**

**గురుగ్రామ్ వైద్యుడి నుంచి పొందిన రాజస్తాన్ సోదరులు**

**పరీక్షకు వారం ముందే ఈ వ్యవహారం -సికార్ కేంద్రంగా దేశవ్యాప్తంగా లీక్**

**దర్యాప్తులో వెలుగులోకి కీలక విషయాలు -ఇప్పటికి ఐదుగురి అరెస్ట్**




**న్యూఢిల్లీ :మే 13,(ప్రజావినికిడి):**
దేశవ్యాప్తంగా సంచలనం రేపిన నీట్ యూజీ-2026 ప్రశ్నాపత్రం లీక్ కేసులో దర్యాప్తు ముమ్మరమవుతోంది. రాజస్తాన్‌లోని జామ్‌వా రామ్‌గఢ్‌కు చెందిన మంగీలాల్, దినేష్ బివాల్ అనే ఇద్దరు సోదరులు పరీక్షకు వారం ముందే హర్యానాలోని గురుగ్రామ్‌కు చెందిన ఓ డాక్టర్ నుంచి రూ.30 లక్షలకు ప్రశ్నాపత్రాన్ని కొనుగోలు చేసినట్టు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. అనంతరం ఆ ప్రశ్నాపత్రాన్ని వారు పలువురు అభ్యర్థులకు విక్రయించినట్టు ఆరోపణలు ఉన్నాయి.
మిగతా 2లో...



## ఫ్యూచర్ సిటీలో ఉబర్

**సీఎంతో ఉబెర్ సీఈఓ దారా ఖోస్రోషాహి భేటీ**

**పార్కింగ్ సమస్యపై దృష్టిపెట్టండి : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన**

**హైదరాబాద్ మే 13,(ప్రజావినికిడి):**
ప్రధాన నగరాల్లో పెరుగుతున్న పార్కింగ్ సమస్యపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఉబర్ సంస్థకు సూచించారు. అవకాశం ఉంటే మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని ఆయన కోరారు. మిగతా 2లో...

## సైబర్ నేరాలు అరికట్టండి

**అధికారులకు సిఎం ఆదేశం**



**అమరావతి : మే 13,(ప్రజావినికిడి):**
సైబర్, ఆర్థిక నేరాలు అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాల్లో తక్షణ స్పందన-ఎపిలో నియంత్రణా వ్యవస్థలపై సచివాలయంలో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నేరాల్లో బాధితులు పోగొట్టుకున్న సొమ్మును రాబట్టేందుకు గోల్డెన్ అవర్ ఫండ్ రికవరీ టెక్నాలజీలపై దృష్టి పెట్టాలని చెప్పారు. ఈ అంశంపై అవసరమైతే రిజర్వు బ్యాంకును సంప్రదించాలని తెలిపారు. మిగతా 2లో...




## బంగారం, వెండిలపై కస్టమ్స్ డ్యూటీ పెంపు

**6నుంచి 15 శాతానికి పెంచిన కేంద్రం**

**న్యూఢిల్లీ, మే 13,(ప్రజావినికిడి):**
బంగారం, వెండి దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని కేంద్రం తాజాగా పెంచింది. బేసిక్ కస్టమ్స్ డ్యూటీని 10 శాతానికి, అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్టక్చర్ అండ్ డెవలప్‌మెంట్ సెస్‌ను 5 శాతానికి పెంచింది. దీంతో, మొత్తం దిగుమతుల సుంకం 15 శాతానికి చేరింది. గతంలో ఇది 6 శాతంగా ఉండేది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలో 95.75కి పతనమైన నేపథ్యంలో మిగతా 2లో...

## మూసీకి హద్దు రాళ్లు

**నది హద్దులను గుర్తిస్తూ ఏర్పాటు చేస్తున్న అధికారులు**

**గండిపేట నుంచి నార్సింగి వరకు పూర్తి -త్వరలోనే బాపూఘాట్ వరకు ఏర్పాటు**

**హైదరాబాద్ సిటీ/మే 13,(ప్రజావినికిడి):**
మూసీ నది హద్దులు ఖరారవుతున్నాయి. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా అధికారులు నది వెంట హద్దు రాళ్లు ఏర్పాటు చేసే పని ప్రారంభించారు. గండిపేట జలాశయం దిగువ నుంచి బాపూఘాట్ వరకు మూసీ నది, బఫర్ జోన్‌లను రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు గతంలోనే నిర్ధారించాయి. దాని ప్రకారం 'మూసీ నది అభివృద్ధి కార్పొరేషన్' అధికారులు.. బుధవారం గండిపేట నుంచి నార్సింగి గోశాల వరకు సర్వే చేసి హద్దురాళ్లను ఏర్పాటు చేశారు. ఇటు మూసీతోపాటు అటు ఈసీ నదికి కూడా హిమాయత్ సాగర్ నుంచి రెండూ సంగమించే బాపూఘాట్ వరకు హద్దులు ఏర్పాటు చేయనున్నారు.



## చమురు సంక్షోభంతో పొదుపు మంత్రం

**కాన్వాయ్‌లో కార్ల సంఖ్యనుద**

**తగ్గించిన ప్రధాని**

**అదేబాటలో హోంమంత్రి అమిత్ షా**

**పలు ర్రాష్టాల సిఎంలు కూడా పొదుపుబాట**



# చమురు సంక్షోభంతో పొదుపు మంత్రం

## కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను తగ్గించిన ప్రధాని

## అదేబాటలో హోంమంత్రి అమిత్ షా

## పలు రాష్ట్రాల సీఎంలు కూడా పొదుపుబాట



**న్యూఢిల్లీ, మే 13,(ప్రజావినికిడి): :** పశ్చిమాసియా ఉద్రిక్తతల ఫలితంగా గత కొంతకాలంగా ముడి చమురు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. చమురు దిగుమతులపైఆధారపడ్డ అనేక దేశాల్లో సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో భారతీయులు కూడా వృథా ఖర్చులు తగ్గించుకుని పొదుపు చర్యలను చేపట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ప్రధాని పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ప్రధాని తన కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను సగానికి తగ్గించాలని ఆదేశించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అంతేకాకుండా, విద్యుత్ కార్ల వినియోగాన్ని పెంచాలని కూడా ప్రధాని సూచించినట్టు తెలుస్తోంది. మీడియా కథనాల ప్రకారం, కాన్వాయ్‌లోని కార్ల సంఖ్యను 50 శాతం మేర తగ్గించాలని ప్రధాని భద్రత దళం స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్‌కు (ఎస్పీజీ) ఆదేశాలు అందాయి. భద్రతా ప్రొటోకాల్ పాటిస్తూనే పొదుపు చర్యలు చేపట్టాలని ఎస్పీజీకి సూచనలు వెళ్లినట్టు సమాచారం. ఈ దిశగా ఎస్పీజీ కార్యాచరణ మొదలెట్టినట్టు కూడా తెలుస్తోంది. తన కాన్వాయ్‌లో విద్యుత్ కార్ల సంఖ్యను పెంచేందుకు కూడా చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ సూచించినట్టు తెలుస్తోంది. ఇందుకోసం ప్రస్తుతం అందుబాటులో ఉన్న కార్లనే వినియోగించాలని, కొత్తవి కొనవద్దని కూడా ప్రధాని స్పష్టం చేసినట్టు సమాచారం. ఇకపోతే హోంమంత్రి అమిత్ షా కూడా తన కాన్వాయ్‌లో వాహనాలను తగ్గించుకున్నట్లు వెల్లడించారు. ఇప్పుడున్న కాన్వాయ్‌లో దాదాపు సగం వరకు తగ్గించారని సమాచారం. ఇతర ప్రభుత్వ శాఖలు కూడా ఈ తరహా పొదుపు చర్యలకు సమాయత్తం అవుతున్నట్టు తెలుస్తోంది. ఇంధన పొదుపు కోసం ఏయే చర్యలు తీసుకోవాలనే దానిపై పలు శాఖలు సమీక్షలు జరుపుతున్నాయి. ఇక మధ్యప్రదేశ్, రాజస్థాన్ సీఎంల కాన్వాయ్ కుదింపునకు కూడా సన్నాహాలు జరుగుతున్నట్టు సమాచారం.

# ఫ్యూచర్ సిటీలో ఉబర్

మొదటిపేజీ తరువాయి

బుధవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఉబెర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందం భేటీ అయింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలంగాణలో ఉబెర్ సంస్థ వ్యాపార కార్యకలాపాలను దారా ఖోస్రోషాహి వివరించారు. హైదరాబాద్‌లో ఉబెర్ ఎక్సలెన్స్ సెంటర్ ను విస్తరిస్తున్నట్టు ఆయన తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేననీ, ఇక్కడ 600 మంది ఇంజినీర్లు పనిచేస్తున్నట్టు ప్రకటించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆయన ముందుకు వచ్చారు. భవిష్యత్తులో మరింత విస్తరణకు ఆసక్తిగా ఉన్నామని దారా ఖోస్రోషాహి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ సహకారం ఉండాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. దేశంలోని ప్రధాన నగరాల్లో పార్కింగ్ ప్రధాన సమస్యగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఇది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటు పై దృష్టి సారించాలని ఉబెర్ ప్రతినిధులకు సీఎం సూచించారు. మెట్రో స్టేషన్ల దగ్గర తగిన పార్కింగ్ సౌకర్యం లేదని తెలిపారు. దీని వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈవీ చార్జింగ్ సెంటర్లతో పాటు పార్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని సీఎం సూచించారు. ముఖ్యమంత్రి సూచనపై తప్పకుండా అధ్యయనం చేస్తామని ఉబెర్ ప్రతినిధి బృందం తెలిపింది.

హైదరాబాద్‌కు సమీపంలో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉబెర్ ప్రతినిధులకు వివరించారు. 30 వేల ఎకరాల్లో నిర్మించే ఈ సిటీ ప్రపంచంలోనే ప్రత్యేకమైనదన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 500 కంపెనీలను ఫ్యూచర్ సిటీకి ఆహ్వానిస్తున్నామనీ, ఇప్పటికే పలు సంస్థలు తమ కార్యకలాపాల కోసం ముందుకు వచ్చాయని సీఎం తెలిపారు. శంషాబాద్ విమానాశ్రయానికి 25 కిలోమీటర్ల దూరంలోనే ఫ్యూచర్ సిటీ ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. గత డిసెంబర్‌లో ఇక్కడ నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో 100కు పైగా కంపెనీలు పాల్గొని పెట్టుబడులకు ముందుకు వచ్చాయని వివరించారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి సీఈఓ దారా ఖోస్రోషాహి ఆసక్తి చూపించారు. ఈ సమావేశంలో ఉబెర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ (సీబీవో) మధు కన్నన్, ఉబెర్ ఇండియా సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

# విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్

మొదటిపేజీ తరువాయి

నమోదు చేసుకున్నారు. కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు, వీసీకే, ఐయూఎంఎల్ పార్టీల ఎమ్మెల్యేలు టీవీకేకు అనుకూలంగా ఓటు వేశారు. అన్నాడీఎంకేకు చెందిన పలువురు రెబెల్ ఎమ్మెల్యేలూ విజయ్‌కు మద్దతుగా నిలిచారు. ఇక డీఎంకే ఈ విశ్వాసపరీక్షను బహిష్కరించింది. పార్టీకి చెందిన 59 మంది ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. దీంతో, సభలో సభ్యుల సంఖ్య తగ్గి మ్యాజిక్ మార్కులో కూడా ఆ మేరకు కోత పడింది. ఈ క్రమంలో బలపరీక్షలో సీఎం విజయ్ సులువుగా నెగ్గారు. ఈ సందర్భంగా సీఎం విజయ్ ప్రసంగిస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వంలో అందరికీ సమాన అవకాశాలు ఉంటాయని హామీ ఇచ్చారు. ప్రజలను నమ్ముకునే ఎన్నికల బరిలోకి దిగామని గుర్తు చేసుకున్నారు. అన్ని వర్గాలకు తమపై నమ్మకం ఉందని అన్నారు. తమను గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇక టీవీకేకు మద్దతిచ్చిన అన్నాడీఎంకే రెబెల్ ఎమ్మెల్యేల తరపున సీనియర్ నేత వేలుమణి మాట్లాడుతూ తాము ఎలాంటి మంత్రి పదవులనూ ఆశించట్లేదని అన్నారు. ప్రలోభాలు చూపించి మద్దతు కూడగట్టాల్సిన అవసరం తమకు లేదని సీఎం విజయ్ ఈ సందర్భంగా బదులిచ్చారు. తమ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతిచ్చిన పార్టీలకు మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు. మా ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఉంటుంది. లౌకిక విధానాన్ని అవలంబిస్తూ పాలన సాగిస్తాం. గత ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తాం. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టిసారిస్తాం. అందరికీ సామాజిక న్యాయాన్ని అందించే బాధ్యత మాది‘ అని విజయ్ పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా ఓఎస్‌డీ నియామకంపై వచ్చిన విమర్శలపై స్పందిస్తూ.. దాన్ని పునఃసమీక్షిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రికి ప్రత్యేక విధుల అధికారి గా రిక్కి రాధన్ పండిట్ వెట్రివేల్‌ను నియమించడంపై పలు పార్టీల నుంచి వ్యతిరేకత ఎదురైంది.

అంతకుముందు చర్చ సందర్భంగా శాసనసభలో ఒకింత గందరగోళం నెలకొంది. అన్నాడీఎంకే అధినేత, మాజీ సీఎం పళనిసామి మాట్లాడుతూ.. విజయ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. తమ ఎమ్మెల్యేలకు ఆయన డబ్బులు ఆఫర్ చేశారని ఆరోపించారు. బలపరీక్షకు ముందు తమ పార్టీ ఎమ్మెల్యేలను సీఎం కలవడం సమంజసం కాదని పేర్కొన్నారు. అన్నాడీఎంకే పార్టీ ఐక్యంగానే ఉందని.. తమ ఎమ్మెల్యేలంతా విజయ్‌కు వ్యతిరేకంగా ఓటేస్తారని పళనిస్వామి తెలిపారు. అయితే, ఈ వ్యాఖ్యలను అన్నాడీఎంకే రెబల్ వర్గం ఎమ్మెల్యేలు ఖండించారు. తామంతా విజయ్‌కే మద్దతిస్తామని రెబల్ వర్గం నేత వేలుమణి స్పష్టంచేశారు. ఇక చర్చలో డీఎంకే ఎమ్మెల్యే ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ విజయ్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ‘ఈ రాష్ట్రానికి రియల్ ప్రభుత్వం కావాలి. రీల్ ప్రభుత్వం కాదు. టీవీకే ప్రభుత్వానికి మెజార్టీ లేదు. మా కూటమిలోని పార్టీలు ఇప్పుడు మద్దతివ్వడం వల్లే విజయ్ గట్టెక్కగలుగుతున్నారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం ఎమ్మెల్యేల కొనుగోళ్లకు పాల్పడ్డారు. దీనివల్ల రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతింటోంది‘ అని ఉదయనిధి విమర్శించారు. విజయ్‌ను రాష్ట్రంలో మెజారిటీ ప్రజలు తిరస్కరించారని అన్నారు. విశ్వాసపరీక్ష సందర్భంగా అన్నాడీఎంకే మద్దతును కొనుగోలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయని అన్నారు. ఇప్పటివరకూ డీఎంకే అమలు చేసిన పథకాలను కొనసాగించాలని కూడా డిమాండ్ చేశారు.అనంతరం బలపరీక్ష ఓటింగ్‌లో తాము పాల్గొనబోమంటూ సభ నుంచి డీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు.

234 శాసనసభ స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ 108 స్థానాల్లో గెలుపొందింది. ఇందులో విజయ్ రెండుచోట్ల పోటీ చేశారు. డీఎంకే 59, అన్నాడీఎంకే 47 చోట్ల గెలుపొందింది. కాంగ్రెస్ 5, పీఎంకే 4, ఐయూఎంఎల్ 2, సీపీఐ 2, వీసీకే 2, సీపీఎం 2, భాజపా 1, డీఎండీకే 1, ఏఎంఎంకే 1 చోట విజయం సాధించాయి.

# ఖరీఫ్ సీజన్‌లో14 పంటలకు మద్దతు ధర పెంపు

మొదటిపేజీ తరువాయి

అలాగే, ఖరీఫ్ సీజన్ మద్దతు ధరల నుంచి కోల్ గ్యాసిఫికేషన్, రైల్వే ప్రాజెక్టులు, విమానాశ్రయ ఆధునికీకరణ వరకు భారీ కేటాయింపులకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగల్ ఇచ్చింది.

ఖరీఫ్ సీజన్‌లో 14 పంటలకు మద్దతు ధర పెంపు నకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఆయా పంటలకు క్వింటాకు పెంచిన ధరలు ఇలా ఉన్నాయి.

**కోల్ గ్యాసిఫికేషన్ పథకానికి రూ.37,500 కోట్లు**

దేశంలో బొగ్గు వినియో గాన్ని ఆధునికీకరించేందుకు కోల్/లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులకు రూ.37,500 కోట్ల కేటాయింపునకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుతో దిగుమతి ఇంధనాల పై ఆధారాన్ని తగ్గిం చడంతో పాటు దేశీయ పరి శ్రమలకు మద్దతు లభించనుంది.

**గుజరాత్‌లో సెమీ హైస్పీడ్ రైల్వేలైన్‌కు గ్రీన్ సిగల్**

గుజరాత్‌లోని అహ్మదా బాద్ జిల్లాలోని సర్కేజీ ధోలేరా మధ్య సెమీ హైస్పీడ్ డబుల్ రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 134 కిలో మీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.20,667 కోట్లుగా పేర్కొంది. 2030-31 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి కానుంది.

**పీపీపీ కింద నాగపూర్ అంతర్జాతీయ విమానాశ్రయ ఆధునికీకరణ**

మహారాష్ట్రలోని నాగపూర్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రభుత్వ, ప్రయి వేట్ భాగస్వామ్యం (పీపీపీ) కింద ఆధునికీకరించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కొత్త సదుపాయాలు, విస్తరణ పనులతో విమానాశ్రయ సేవలు మరింత మెరుగుపడనున్నాయని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వివరించారు.

ఒడిసలు రూ.10,052
వరి (సాధారణ రకం) రూ.2,441
వరి (గ్రేడ్ ఏ) రూ.2,461
హైబ్రిడ్ జొన్నలు రూ.4,023
మల్దండి జొన్నలు రూ.4,073
సజ్జలు రూ. 2,900
రాగులు రూ.5,205
మొక్కజొన్న రూ. 2,410
కందులు రూ. 8,450
పెసర్లు రూ.8,780
మినుములు రూ.8,200
పత్తి (మధ్యరకం) రూ.8,267
పత్తి (లాంగ్ రకం) రూ. 8,667
వేరుశనగ రూ.7,517
పొద్దుతిరుగుడు రూ.8,343
సోయాబీన్ రూ.5,708
నువ్వులు రూ.10,346

# నీట్ ప్రశ్నాపత్రం లీక్ కేసులో కదులుతున్న డొంక

మొదటిపేజీ తరువాయి

**ప్రశ్నాపత్రాన్ని తన కుమారుడినకి అందించిన నిందితుడు**

దర్యాప్తులో తేలిన వివరాల ప్రకారం.. రాజస్తాన్‌కు చెందిన ఇద్దరు సోదరుల్లో ఒకరు గురుగ్రామ్ వైద్యుడి నుంచి కొనుగోలు చేసిన ఆ ప్రశ్నాపత్రాన్ని నీట్‌కు సిద్ధమవుతున్న తమ కుమారుడికి అందించారు. ఆ తర్వాత వారు ఏప్రిల్ 29న సికార్‌లో పలువురికి విక్రయించినట్టు సమాచారం. దీంతో రాజస్తాన్‌లోని సికార్ ఈ ఏడాది పేపర్ లీక్ వ్యవహారానికి కేంద్రబిందువుగా మారింది. జామ్‌వా రామ్‌గఢ్ నుంచి ప్రశ్నాపత్రం ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ఏజెంట్ రాకేశ్ కుమార్ మండావారియాకు చేరగా, ఆయన దానిని మరొకరికి విక్రయించాడు. కోచింగ్ సెంటర్ల పరిసరాల్లో కార్యకలాపాలు నిర్వహించే రాకేశ్.. ఆ పేపర్‌ను రూ.30 వేలకు కేరళలో ఎంబీబీఎస్ చదువుతున్న సికార్‌కు చెందిన ఓ విద్యార్థికి అమ్మినట్టు ఆరోపణలు ఉన్నాయి.

**ఓ హాస్టల్ ఓనర్‌కు చేరిన ప్రశ్నాపత్రం**

అటు తర్వాత పరీక్షకు ఒక రోజు ముందు సదరు విద్యార్థి సికార్‌లో పీజీ హాస్టల్ నడుపుతున్న తన తండ్రికి వాట్సాప్ ద్వారా ప్రశ్నాపత్రం పంపాడు. సికార్‌లోని ఒక స్నేహితుడి నుంచి తనకు ఈ ప్రశ్నాపత్రం అందిందనీ, హాస్టల్‌లో ఉన్న బాలికల (విద్యార్థినులు)కు దీనిని ఇవ్వాలని ఆ విద్యార్థి తన తండ్రికి చెప్పాడు. రేపు జరిగే పరీక్షలో ఇవే ప్రశ్నలు వస్తాయని కూడా చెప్పినట్టు దర్యాప్తులో తేలింది. అనంతరం ఆ ప్రశ్నాపత్రం హాస్టల్‌లో ఉన్న పలువురికి చేరినట్టు అధికారులు చెబుతున్నారు. కాగా ఈ కేసులో గురుగ్రామ్ డాక్టర్ కీలక పాత్రధారిగా ఉన్నాడు. ఈ ప్రశ్నాపత్రం మొదట మహారాష్ట్రలోని నాసిక్ ప్రింటింగ్ ప్రెస్ నుంచి చైన్ నెట్‌వర్క్ ద్వారా గురుగ్రామ్ వైద్యుడి వద్దకు చేరిందని, అక్కడి నుంచి రాజస్తాన్ సోదరులు ఇద్దరు కొనుగోలు చేసి, ఇతరులకు విక్రయించినట్టు రాజస్తాన్ పోలీసుల ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎస్ఓజీ) అనుమానిస్తోంది. అయితే గురుగ్రామ్‌లోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) అధ్యక్షుడు డా.రాజేశ్ కతారియా మాట్లాడుతూ.. ఈ వ్యవహారంపై గురుగ్రామ్ వైద్యుడి గురించి తమను ఇప్పటివరకు ఎలాంటి దర్యాప్తు సంస్థ కూడా సంప్రదించలేదని తెలిపారు.

**ప్రశ్నాపత్రం లీకేజీపై నెలరోజుల ముందే సమాచారం**

దర్యాప్తులో మరో కీలక అంశం వెలుగులోకి వచ్చింది. అరెస్టయిన సోదరులకు నెల రోజుల ముందే పేపర్ లీక్ అవుతుందని సమాచారం ఉన్నట్టు అధికారులు గుర్తించారు. వీరిలో దినేశ్‌కు ఒక రాజకీయ పార్టీతో సంబంధం ఉన్నట్టు కూడా సమాచారం. వీరి కుటుంబానికి చెందిన నలుగురు విద్యార్థులు నీట్‌లో అర్హత సాధించినట్టు కూడా దర్యాప్తు వర్గాలు చెప్తుండటం గమనార్హం.

**సికార్‌లో వాట్సాప్, టెలిగ్రామ్ తో ప్రశ్నాపత్రం షేరింగ్**

ఇక ఈ ప్రశ్నాపత్రం లీకైన సికార్‌లో విద్యార్థులు, కోచింగ్ నిర్వాహకులు కలిసి వాట్సాప్, టెలిగ్రాఖమ్ గ్రూపు ఏర్పాటు చేసుకొని వాటి ద్వారా ప్రశ్నాపత్రాన్ని పంచుకున్నట్టు తెలుస్తోంది. నాసిక్ ప్రింటింగ్ ప్రెస్ నుంచి హర్యానా, జామ్‌వా రామ్‌గఢ్ మార్గంగా సికార్‌కు చేరిన ప్రశ్నాపత్రం , ఆ తర్వాత అక్కడి నుంచి జమ్మూకాశ్మీర్, బీహార్, కేరళ, ఉత్తరాఖండ్‌లకు వ్యాపించినట్టు అధికారులు అనుమానిస్తున్నారు.

**700 మందికి పంపిణీ చేసిన రాకేశ్ కుమార్**

కాగా డెహ్రాడూన్‌లో అరెస్టయిన రాకేశ్ కుమార్ మండావారియా దాదాపు 700 మంది విద్యార్థులకు ప్రశ్నాపత్రాన్ని పంపిణీ చేసినట్టు సమాచారం. అనంతరం ఆ పీడీఎఫ్ విస్తృతంగా చక్కర్లు కొట్టడంతో పాటు ప్రింటెడ్ కాపీల రూపంలో కూడా విక్రయించబడినట్టు సమాచారం. హర్యానాలో పేపర్ విక్రయించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న యశ్ యాదవ్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో కూడా ఈ కేసుకు సంబంధించి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో నీట్ పరీక్ష లీక్ వ్యవహారంలో ఇప్పటికీ ఐదుగురు అరెస్టయ్యారు. ఈనెల 3న నిర్వహించిన నీట్ యూజీ 2026 పరీక్షను కేంద్ర ప్రభుత్వం అనుమతితో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) మంగళవారం రద్దు చేసిన విషయం విదితమే. అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కేంద్రం ఆదేశించడంతో సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. కొత్త పరీక్ష తేదీలను 7 నుంచి 10 రోజుల్లో ప్రకటిస్తామని ఎన్‌టీఏ ఇప్పటికే స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో సీబీఐ క్రిమినల్ కుట్ర, మోసం, నమ్మకద్రోహం, సాక్ష్యాల ధ్వంసం తదితర అభియోగాలతో కేసు నమోదు చేసింది. అలాగే అవినీతి నిరోధక చట్టం, పబ్లిక్ ఎగ్జామినేషన్ ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్ యాక్ట్-2024 కింద కూడా కేసులు నమోదు చేసింది.రాజస్తాన్ పోలీసుల ఎస్ఓజీ స్వాధీనం చేసుకున్న "కెమిస్ట్రీ గెస్ పేపర్"లో ఉన్న 410 ప్రశ్నల్లో దాదాపు 120 ప్రశ్నలు అసలు పరీక్షలో వచ్చినట్టు ప్రాథమిక విచారణలో తేలిందని అధికారులు తెలిపారు.

# 15న ఆధారాలతో విచారణకు వస్తా

## పోలీసులకు బండి భగీరథ్ లేఖ

**హైదరాబాద్,మే 13,(ప్రజావినికిడి):**

పేట్ బషీరాబాద్ పోలీసులకు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ ఓ లేఖ పంపించారు. బుధవారం మధ్యాహ్నం పోలీసుల ఎదుట హాజరు కావాల్సి ఉన్నప్పటికీ, వ్యక్తిగత కారణాల నేపథ్యంలో మే 15వ తేదీన విచారణకు హాజరవుతానని తన లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు సిట్ అధికారులకు ఈమెయిల్‌తో పాటు అధికారిక లేఖను కూడా బండి భగీరథ పంపించారు. ఈ కేసులో విచారణకు హాజరయ్యే సమయంలో కీలక ఆధారాలు, సాక్ష్యాలతో వస్తానని ఆయన స్పష్టం చేశారు. అలాగే సిట్ అధికారుల దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని భగీరథ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో అవసరమైన సమాచారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. బండి భగీరథ పంపిన లేఖ ప్రస్తుతం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మే 15వ తేదీన జరగనున్న విచారణలో ఆయన సమర్పించే ఆధారాలు కీలకంగా మారే అవకాశం ఉంది. అయితే భగీరథ బెయిల్ కేసులో గురువారం 14న హైకోర్టులో విచారణ జరగాల్సి ఉంది.

# సైబర్ నేరాలు అరికట్టండి

మొదటిపేజీ తరువాయి

ఆర్థిక, సైబర్ నేరాల్లో ఇన్వెస్ట్ మెంట్ ఫ్రాడ్స్ పెద్ద ఎత్తున జరుగుతున్నాయనే అంశంపై సిఎం కొన్ని సూచనలు చేశారు. ఆథార్ అథంటికేషన్, కెవైసి వంటివి లేకుండా ప్రారంభిస్తున్న షెల్ కంపెనీలపై అధ్యయనం చేయాలన్నారు. బ్యాంకర్లు, పోలీసు విభాగం, ఏపీటీఎస్, ఆర్థిక శాఖల సమన్వయంతో ఆన్ లైన్ ఆర్థిక మోసాల విషయంలో ఓ నియమావళిని సిద్ధం చేయాలని నిర్దేశించారు. అనుమానిత బ్యాంకు ఖాతాలను ఫ్లాగ్ చేసే అంశాన్ని పరిశీలించి, ఖాతాదారుల ప్రయోజనాలు రక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. యుపిఐ పేమెంట్స్ ద్వారా మిలియన్ల సంఖ్యలో ఆర్థిక లావాదేవీలు క్షణాల్లో జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో గోల్డెన్ అవర్ ఫండ్ రికవరీ అంశంపై మరింతగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. సైబర్ నేరాల నియంత్రణలో ఎపిటిఎస్ ముఖ్య భూమిక పోషించాలని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో టెక్నాలజీలను అధ్యయనం చేయాలని సూచించారు. అన్ని బ్యాంకులు వారాంతాల్లో పెద్ద మొత్తంలో జరిగే ఆర్థిక లావాదేవీలపై దృష్టి పెట్టాలని చెప్పారు. కొన్ని నిబంధనల్ని మార్చుకునే విషయంలో రిజర్వు బ్యాంకును సంప్రదించాలని అన్నారు. హర్యాణా, మహారాష్ట్ర సహా ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ఉత్తమ విధానాల్ని అధ్యయనం చేసి ఓ నిర్దిష్టమైన కార్యాచరణ సిద్ధంచేయాలని చెప్పారు. దీంతో పాటు ప్రజల్లో నిరంతరం అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు.

# నేడు ఎపి కేబినేట్ భేటీ

**అమరావతి,మే 13,(ప్రజావినికిడి):**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం కేబినెట్ భేటీ జరగనుంది. ఉదయం 10:30 గంటలకు ఏపీ సచివాలయంలో మంత్రిమండలి సమావేశం కానుంది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పొదుపు పిలుపు, చర్యలపై సీఎం, మంత్రులు ప్రత్యేకంగా చర్చించనున్నారు. అనంతరం దీనిపై అధికారులు, మంత్రులకు సీఎం చంద్రబాబు పలు కీలక సూచనలు చేసే అవకాశం కనిపిస్తోంది.ఏపీలోని ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ అంశంపైనా మంత్రిమండలిలో సుదీర్ఘంగా చర్చించనున్నారు. 17వ ఎస్ఐపీబీ ఆమోదించిన పలు అంశాలపైనా చర్చించి ఆమోదం తెలపనున్నారు. మొత్తం 25 ప్రాజెక్టులకు సంబంధించి రూ.2,01,023 కోట్ల పెట్టుబడులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. విశాఖలో రూ.1 లక్ష కోట్లతో రిలయన్స్ డేటా సెంటర్‌కు మంత్రిమండలి ఆమోదం తెలపనుంది. సత్యసాయి జిల్లాలో రూ.51 వేల కోట్లతో సోలార్ పవర్ ఎ÷-లాంట్‌కు ఆమోదం ఇవ్వనుంది. కడపలో రూ.12 వేల కోట్లతో అదానీ గ్రూప్ హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు ఆమోదముద్ర వేయనుంది. తిరుపతిలో రూ.2,500 కోట్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ ద్విచక్రవాహన తయారీ పరిశ్రమకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. పలు కీలక సంస్థలకు భూ కేటాయింపులకు సంబంధించి సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రిమండలి ఆమోదం తెలపనుంది.

# మూసీకి హద్దు రాళ్లు

మొదటిపేజీ తరువాయి

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరం మధ్యగా ప్రవహిస్తున్న మూసీ నది భారీగా ఆక్రమణలకు గురైంది. కొన్నిచోట్ల నది తీరంలో మట్టితో పూడ్చి కాలనీలను కూడా ఏర్పాటు చేశారు. 2020 అక్టోబర్‌లో భారీ వరదతో మూసీ ఉప్పొంగడంతో చాలా కాలనీలు, తీరం వెంట ఇళ్లు నీట మునిగాయి. ఈ క్రమంలో చర్యలు చేపట్టిన ప్రభుత్వం సర్వే చేసి నది గర్భం, బఫర్ జోన్‌లను మార్కింగ్ చేసింది. తర్వాత పూర్తిస్థాయిలో సర్వే చేసి ఎఫ్‌టీఎల్ హద్దు రాళ్లను ఏర్పాటు చేస్తామని అధికారులు అప్పట్లో ప్రకటించారు. హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు, సర్వేయర్లు చేపట్టిన సుదీర్ఘ కసరత్తు ఇటీవలే పూర్తయింది. ఎఫ్‌టీఎల్ తర్వాత 50 మీటర్ల వరకు బఫర్‌జోన్‌గా ఖరారు చేసి, హద్దురాళ్లు పెడుతున్నారు.

# బంగారం, వెండిలపై కస్టమ్స్ డ్యూటీ పెంపు

మొదటిపేజీ తరువాయి

అప్రమత్తమైన ప్రభుత్వం కస్టమ్స్ డ్యూటీని పెంచింది. బంగారం వినియోగంలో భారత్ ప్రపంచంలో రెండో స్థానంలో ఉన్న విషయం తెలిసిందే. వెండి వినియోగంలో ప్రథమ స్థానంలో ఉంది. దేశీయ అవసరాల కోసం భారత్ ఎక్కువగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇక ఈక్విటీ మార్కెట్‌లో రాబడులు మందగించిన నేపథ్యంలో గతేడాది భారత్‌లో బంగారానికి డిమాండ్ పెరిగింది. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ నివేదిక ప్రకారం, ఈ మార్చితో ముగిసిన త్రైమాసికంలో గోల్డ్ ఆధారిత ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లో పెట్టుబడులు గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 186 శాతం మేర పెరిగాయి. కస్టమ్స్ డ్యూటీ పెంపుతో బంగారం, వెండికి డిమాండ్ తగ్గే అవకాశం ఉంది. ఇప్పటికే ధరలు అధికంగా ఉన్నందున కస్టమ్స్ డ్యూటీ పెంపుతో బంగారం, వెండికి డిమాండ్ తగ్గవచ్చని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. బంగారం,

వెండి దిగుమతుల కట్టడి కోసం ఇటీవల ప్రభుత్వం 3 శాతం ఐజీఎస్టీ విధించింది. దీంతో, బ్యాంకులు దిగుమతులకు దాదాపు నెల రోజుల పాటు బ్రేక్ చెప్పాయి. ఫలితంగా ఏప్రిల్‌లో దిగుమతులు 30 ఏళ్ల నాటి కనిష్ఠాన్ని తాకాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులను తట్టుకునేందుకు దేశ ప్రజలు పొదుపు చర్యలు పాటించాలని ప్రధాని మోదీ ఆదివారం పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

## చలో హనుమకొండ విజవంతం చెయ్యండి



**వాజేడు మే14,(ప్రజావినికిడి):**మే17 మా తేదీన తుడుం దెబ్బ ఐక్యత సభను విజయవంతం చేయండి. ములుగు జిల్లా వాజేడు మండలం కోయవీరాపురం గ్రామంలో తుడుం దెబ్బ మండల కమిటీ ఆధ్వర్యంలో కోయవీరాపురం గ్రామ ప్రజలతో మండల కమిటీ మాట్లాడుతూ, హనుమకొండ లో జరిగే సభను విజయవంతం చేయాలని ప్రతి గ్రామం నుంచి యువత గ్రామ పెద్దలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలనిక కోరారు ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆదివాసులు వెనుక పడుతున్నారని చట్టాల్ని ఏమాత్రం పట్టించుకోవడంలేదని ప్రభుత్వాలు 1970 సంవత్సరం నుంచి భారత రాజ్యాంగం వచ్చినప్పటి నుంచి చట్టాలు ఏమాత్రం అమలు కావడం లేదని 1/70 చట్టాలను. పేసా చట్టం విద్య ఉద్యోగ రాజకీయ రిజర్వేషన్ల కోసం కంపల్సరిగా పోరాడాల్సిన అవసరం వస్తుందని మన ఆదివాసుల హక్కులను చట్టాలను రిజర్వేషన్లను సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలని ప్రతి ఒక్కరు ఉద్యమించాలని ఈ సందర్భంగా మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ మండల అధ్యక్షుడు తొర్రెమ్ సంతోష్ మండల కార్యదర్శి చాప లక్ష్మణ్,మండల కోశాధికారి వాసం సంతోష్,గ్రామ పెద్దలు యువత పాల్గొనడం జరిగింది

## పేపర్ లీకేజీ ఘటనపై ఎస్ఎఫ్ఐ నిరసన




**ముషిరాబాద్,(ప్రజావినికిడి):**
నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనపై నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ క్రాస్ రోడ్స్ చౌరస్తాలో గొంతుకు ఉరితాడు బిగించుకుని వినూత్నంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పలుమార్లు పరీక్షా పత్రాల లీకేజీలు జరగడం బాధాకరమని అన్నారు. దాదాపు 20 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న బాధ్యులపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ఈ ఘటనకు నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలని కోరారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విద్యార్థుల విశ్వాసాన్ని కోల్పోయిందని, "నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కాదు, నథింగ్ టెస్టింగ్ ఏజెన్సీ"గా మారిందని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నీట్ పరీక్షను రాష్ట్రాల వారీగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

## బీజేపీ రాష్ట్రాలలో ప్రతి సారి నీట్ రద్దు




**హిమాయత్ నగర్(ప్రజావినికిడి):**
బిజెపి డబుల్ ఇంజన్ ఉన్న రాష్ట్రాలలో నీట్ పరీక్షలు ప్రతిసారి రద్దు కావడం ఏమిటని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ హేమ సుదర్శన్ జిల్లోజు ధ్వజమెత్తారు. హైదరాబాద్ ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, దేశంలోని 23 లక్షల విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం ప్రతిసారి నీట్ యూజ్ పరీక్షల్లో బడా బాబులకు కొమ్ము కాస్తూ విఫలం చెందుతుందని దుయ్యబట్టారు. ఎంతో కష్టపడి చదివించిన తల్లిదండ్రులు విద్యార్థుల భవిష్యత్తు మెరుగు పడుతుందని కన్న కలలన్నీ నీరుగారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులకు అమ్ముడుపోయే నరేంద్ర మోడీ సర్కార్ విద్యార్థులపై ఇలాంటి దుర్ఘటనలకు పాల్పడటం సరికాదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి నీట్ యూజీ ఎగ్జామ్ ను ఆన్లైన్లో నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## విపక్షనేతల అంటే లెక్కలేదా ?

### మోడీ తీరుపై మండిపడ్డ్ విహెచ్

**హైదరాబాద్,మే 14,(ప్రజావినికిడి):** మోదీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని ప్రభుత్వ సలహాదారు వీ.హనుమంతరావు విమర్శలు గుప్పించారు. ప్రజాస్వామ్యం అంటే లెక్కలేకుండా పోయిందన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అపోజిషన్ లీడర్ అంటే రబ్బర్ స్టాంప్ అని మోదీ భావిస్తున్నారని మండిపడ్డారు. సీబీఐ డైరెక్టర్ అపాయింట్మెంట్ విషయంలో అపోజిషన్ లీడర్ అభిప్రాయాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రతిపక్ష నేత అభిప్రాయం తీసుకోకపోవడంతో రాహుల్ గాంధీ లేఖ రాసినట్లు చెప్పారు. ప్రధానికి రాహుల్ లేఖ రాయడాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. మోదీకి అనుకూలంగా ఉన్న వాళ్లను సీబీఐ డైరెక్టర్గా నియమిస్తారా అని వీహెచ్ ప్రశ్నించారు. భజన చేసే వాళ్లకే మోదీ.. పదవులు ఇస్తున్నారని ఆరోపించారు. రాహుల్ పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు వీహెచ్ తెలిపారు. అంబేద్కర్ను, రాజ్యాంగాన్ని బీజేపీ అవమానిస్తోందని మండిపడ్డారు. జనగణనలో బీసీ కాలమ్ లేకపోవడం అన్యాయమన్నారు. ఆర్ఎస్ఎస్ చేతిలో నరేంద్ర మోదీ కీలు బొమ్మగా మారారని దుయ్యబట్టారు. 'సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్' అబద్ధమని... బీజేపీ వికాసం మాత్రమే జరుగుతోందని వీహెచ్ వ్యాఖ్యానించారు

## ఏజెన్సీ ప్రాంత చట్టాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలి

### న్యాయకళాశాల సాధన సదస్సు విజయవంతం చేయండి







**వాజేడు,మే 14,(ప్రజావినికిడి):** మే 24 న జరగబోయే మహా గర్జన సదస్సును ఆదివాసి యువత అధిక సంఖ్యలో రావాలని జీఎస్పీ పిలుపు న్యాయ కళాశాల సాధన సదస్సు విజయవంతం చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి కోరారు. బుధవారం వాజేడు మండల వ్యాప్తంగా ఆదివాసి గ్రామాలను విస్తృత స్థాయిలో పర్యటించిన రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి వాజేడు మండలం కోయవీరాపురం గ్రామంలో సమావేశమై, ఈ సంధర్భంగా మాట్లాడుతూ, ఆదివాసులపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు సవతి తల్లి ప్రేమ కనబరుస్తుందని, ఏజెన్సీ ప్రాంత చట్టాలను అమలు పరచడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసి చట్టాల అమలు కోసం ఆదివాసి రక్షణ, ఆదివాసి అస్తిత్వం కోసం ఆదివాసి యువత యువకులు ఉద్యమ బాట పట్టాల్సిన సమయం వచ్చిందని ఆయన తెలిపారు. ఆదివాసి జీవన విధానం మెరుగుపడాలంటే భద్రాచలం కేంద్రంగా ఆదివాసి న్యాయ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ, మే 24న వాజేడు మండలంలో జరగబోయే గోండ్వాన న్యాయ కళాశాల సాధన సదస్సుకి ఆదివాసి, యువతి, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ సాధన సదస్సుని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీఎస్పి ములుగు జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్, ఆదివాసీ నాయకులు బోదేబోయిన సురేష్, పద్ధం సుధాకర్, కారం రాజబాబు కారం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట నూతన దేవాలయ ప్రారంభోత్సవం

### పూజా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి హరీష్ రావు - ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

### మాజీ మంత్రులు మహమూద్ ఆలీ,శ్రీనివాస్ గౌడ్, - మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్,జైపాల్ యాదవ్,నరేందర్ రెడ్డి

**నందిగామ,(ప్రజావినికిడి):** నందిగామ మండలం చెగూర్ గ్రామంలో జరుగుతున్న శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట అదేవిదంగా నూతన దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు తో కలిసి ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మహమూద్ ఆలీ, శ్రీనివాస్ గౌడ్ మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్, నరేందర్ రెడ్డి, మాజీ చేగూర్ మాజీ సర్పంచ్ మామిళ సంతోష విట్టల్, బీఆర్ఎస్ నాయకులు సత్య నారాయణ, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





# ప్రేమ, పెళ్లి పేరుతో మోసం

### మహిళా కానిస్టేబుల్‌ను వంచించిన ఎస్ఐ -కొల్లూరు ఎస్ఐ సురేశ్ సస్పెన్షన్

**హైదరాబాద్,మే 13 (ఆర్ఎన్ఎ):**
మహిళా కానిస్టేబుల్‌ను ప్రేమ పేరుతో ఓ ఎస్సై మోసం చేశాడు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అంతేకాక ఉన్నతాధికారులు సదరు ఎస్సైని సస్పెండ్ చేశారు. ప్రేమిస్తున్నాను అంటూ నమ్మించి.. పెళ్లి పేరుతో కాలయాపన చేస్తూ తప్పించుకు తిరుగుతున్న కొల్లూరు పోలీస్ స్టేషన్ ఎస్సై సురేష్ కుమార్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు . కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ లో మహిళా కానిస్టేబుల్ గా పని చేస్తున్న యువతిని.. పెళ్లి చేసుకుంటానని చెప్పి ప్రేమ పేరుతో మోసం చేసినట్లు కేసు నమోదు కావటంతో.. ఈ నిర్ణయం తీసుకున్నారు ఉన్నతాధికారులు. పూర్తి వివరాల్లోకి వెళితే..2018 బ్యాచ్ ఎస్సై సురేష్ కుమార్.. కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా పని చేస్తున్న యువతితో పరిచయం ప్రేమగా



మారింది. పెళ్లి చేసుకుంటానని చెప్పటంతో.. ఎస్సై సురేష్ కు దగ్గరైంది ఆ మహిళా కానిస్టేబుల్. కొన్నాళ్లుగా పెళ్లి విషయంపై ఒత్తిడి చేస్తుంది. సాకులు చెబుతూ.. పెళ్లిని వాయిదా వేస్తూ వస్తున్నారు ఎస్సై సురేష్ కుమార్. పెళ్లి వాయిదాపై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. వెంటనే పెళ్లి చేసుకోవాలని మహిళా కానిస్టేబుల్ పట్టుబట్టింది. పెళ్లి విషయంలో ఎస్సై సురేష్ కుమార్ తప్పించుకునే ప్రయత్నం చేస్తుండటంతో.. మహిళా కానిస్టేబుల్ గట్టిగా నిలదీసింది. పెళ్లి చేసుకునేది లేదని.. పెళ్లి చేసుకోవటం కుదరదు అని తేల్చి చెప్పారు ఎస్సై సురేష్. ఈ క్రమంలోనే ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేసినట్లు కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ లో కంప్లయింట్ చేసింది మహిళా కానిస్టేబుల్. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. ఎస్సై సురేష్ ను విచారించేందుకు ప్రయత్నించారు. అతని సెల్ ఫోన్లు స్విచ్ఛాఫ్ లో ఉండటంతో.. విచారణకు స్పందించకపోవటం.. అందుబాటులో లేకపోవటం వంటి కారణాలతో.. ఎస్సై సురేష్ కుమార్ ను సస్పెండ్ చేశారు ఉన్నతాధికారులు. బాధితురాలు మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఆధారాలతో ఈ నిర్ణయం తీసుకున్నారు. బాధిత యువతి ఇచ్చిన ఆధారాలతో పోలీస్ ఉన్నతాధికారులు అతణ్ని సస్పెండ్ చేశారు.

## క్రైమ్‌లో తెలంగాణ రైజింగ్

### వెల్‌డన్ రాహుల్ గాంధీ అంటూ..కెటిఆర్ ట్వీట్

**హైదరాబాద్,మే 14,(ప్రజావినికిడి):**
తెలంగాణలో ఆడబిడ్డలపై నేరాలు పెరగడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. అత్యధిక కేసులు కలిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం.. మహిళలపై నేరాల్లో దేశంలోనే అగ్రస్థానానికి చేరిందని ఆరోపించారు. తెలంగాణ మహిళలపై నేరాల రేటులో దేశంలోనే మొట్టమొదటి స్థానంలో నిలిచిందని, సైబర్ నేరాలు కూడా భారీగానే పెరిగాయని విమర్శించారు. ఈ మేరకు ట్విట్టర్ ద్వారా కేటీఆర్ మండిపడ్డారు. దేశంలోని ముఖ్యమంత్రుల్లో అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్న సీఎం రేవంత్ రెడ్డి అని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ ఇచ్చిన నివేదికను




ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తావించారు. 'దేశంలోనే ఏ ముఖ్యమంత్రికి లేనంతగా సీఎం/హోంమంత్రి రేవంత్ రెడ్డిపై అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఆయన నాయకత్వంలో ఇప్పుడు తెలంగాణ మహిళలపై నేరాల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. సైబర్ నేరాల్లో కూడా టాప్‌లో ఉంది.' అని ట్విట్టర్ (ఎక్స్)లో కేటీఆర్ పేర్కొన్నారు. వెల్‌డన్ రాహుల్ గాంధీ.. నిజంగానే తెలంగాణ రైజింగ్ అంటూ కాంగ్రెస్ నాయకత్వాన్ని వ్యంగ్యంగా అభినందించారు.

------

## లిఫ్ట్‌లో మరో చిన్నారి మృత్యువాత

### గచ్చిబౌలి హాస్టల్‌లో ఐదేళ్ల చిన్నారి మృతి

**హైదరాబాద్,మే 14,(ప్రజావినికిడి):** గచ్చిబౌలిలో తీరని విషాదం చోటుచేసుకుంది. లిఫ్టులో ఇరుక్కుని మరో చిన్నారి మృత్యువాత పడింది. గౌలిదొడ్డిలోని ఒక ఉమెన్స్ పీజీ హాస్టల్‌లో ఓ బాలిక లిఫ్ట్ లో ఇరుక్కుని మృతి చెందింది. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఒక కుటుంబం ఉపాధి కోసం నగరానికి వలస వచ్చి.. గౌలిదొడ్డి లోని మహి ఉమెన్స్ పీజీ హాస్టల్ లో వంట పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. ఆ కుటుంబానికి చెందిన ఐదేళ్ల చిన్నారి బిస్తూ గోష్, స్థానిక పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. బుధవారం ప్రమాదవశాత్తు అపార్ట్‌మెంట్‌లోని లిఫ్ట్ ఆ చిన్నారి గ్రౌండ్ ఫ్లోర్ నుండి ఐదో అంతస్తుకు వెళ్తున్న క్రమంలో.. మూడవ అంతస్తు వద్ద చిన్నారి జుట్టు లిఫ్ట్ డోర్లలో ఇరుక్కుపోయింది. అది గమనించేలోపే లిఫ్ట్ కదలడంతో.. చిన్నారి తల నుజ్జునుజ్జు అయి అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. సమాచారం అందుకున్న స్థానికులు డయల్ 100కు కాల్ చేయగా.. పోలీసులు, హైడ్రా, ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన చిన్నారి మృతదేహాన్ని అత్యంత శ్రమతో బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హాస్టల్ నిర్వాహకుల నిర్లక్ష్యం ఉందా? అనే కోణంలో విచారణ సాగుతోంది. ఐదేళ్ల చిన్నారి కళ్లముందే విగతజీవిగా మారడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.



# చెరువులో జారి పడి వృద్ధుడి మృతి...

## అమీనాబాద్‌లో విషాదం

**అనంతగిరి మే 14,(ప్రజావినికిడి):**
అనంతగిరి మండలం అమీనాబాద్ గ్రామంలో బుధవారం విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గుండు కోటయ్య (65) ప్రమాదవశాత్తు ఊర చెరువులో పడి మృతి చెందారు. స్థానికుల వివరాల ప్రకారం.. గేదెలు నీరు తాగేందుకు చెరువులోకి వెళ్లగా వాటిని బయటకు తీసుకువచ్చే క్రమంలో కోటయ్య కాలు జారి చెరువులో లోతైన ప్రాంతంలో పడిపోయినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడకు తరలించినట్లు సమాచారం. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన బ్రిగేడియర్ ఎన్.ఆర్.బాబు

**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ ఎన్.ఆర్.బాబు బుధవారం రోజు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి తో సమావేశమయ్యారు.
ఈ సందర్భంగా బ్రిగేడియర్ ఎన్.ఆర్.బాబు తెలంగాణ మాజీ సైనిక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరగా, ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. దీనికి సంబంధించిన విధి విధానాలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. అలాగే ఇతర రాష్ట్రాలలో మాజీ సైనిక కార్పొరేషన్లు ఎలా పనిచేస్తున్నాయో, వాటి విధానాలు మరియు నమూనాలను సేకరించి త్వరలో ఒక సమావేశం ఏర్పాటు చేద్దామని సూచించారు.
అదేవిధంగా, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి చైర్మన్‌గా ఉన్న రాజ్య సైనిక బోర్డు సమావేశాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని బ్రిగేడియర్



ఎన్.ఆర్.బాబు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కూడా ముఖ్యమంత్రి స్పందిస్తూ ఆ సమావేశాన్ని కూడా తప్పకుండా నిర్వహిస్తామని తెలిపారు.
గౌరవ గవర్నర్ చైర్మన్‌గా ఉన్న స్టేట్ మేనేజింగ్ కమిటీ ఏర్పాటు సంబంధిత ఉత్తర్వులను త్వరగా జారీ చేయాలని బ్రిగేడియర్ ఎన్.ఆర్.బాబు కోరగా,ప్రభుత్వం త్వరలోనే ఆ ఉత్తర్వులను విడుదల చేస్తుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.
ఇంకా మాజీ సైనికులకు సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే,పూర్తి స్థాయి ప్రతిపాదనలతో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శికి అందజేయాలని, వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మాజీ సైనికుల సంక్షేమం పట్ల తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని కూడా తెలిపారు.
మాజీ సైనికుల కోసం సమయం కేటాయించి సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి కి సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ ఎన్.ఆర్.బాబు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శ్రీ అజిత్ రెడ్డి, ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి శ్రీనేష్ కుమార్ నోరి పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ పొదుపు పిలుపు పాటిద్దాం

### మనం కూడా ఆచరించి భాగస్వాములం అవుదాం

### కాన్వాయ్‌లు, భద్రతా సిబ్బందిని కుదించుకుందాం

### నిడమర్రులో జరిగిన కార్యక్రమంలో చంద్రబాబు



**అమరావతి,,మే 14,(ప్రజావినికిడి):**పశ్చిమాసియా యుద్ధ పరిస్థితుల వల్ల దేశంపై పలు విధాలుగా భారం పడుతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రధాని ప్రకటించిన 8 పొదుపు సూచనలు పాటించాలని ప్రజలకు సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. మరో రెండు రోజుల్లో ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వ పరంగా కూడా ఓ కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. ఇలాంటి క్లిష్ట సమయాల్లో ప్రభుత్వాలతో పాటు, ప్రజలు కూడా బాధ్యతగా ఉండాలని సూచించారు. ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు 8 సూచనలను మనం పాటించాలని.. తాత్కాలికంగా వచ్చే ఇబ్బందులను అధిగమించాలని దిశానిర్దేశర చేశారు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించిన పొదుపు సూచనలపై సీఎం స్పందించారు. నిడమర్రులో సీఎం చంద్రబాబు బుధవారం పర్యటించారు. కిమ్స్ ఆస్పత్రికి భూమి పూజ చేశారు. బైసర్ స్కిల్ వర్సిటీ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, అమలాపురం ఎంపీ హరీశ్ బాలయోగి, మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. పెట్రోలు, డీజిల్ వినియోగం తగ్గించాలని.. దీని వల్ల విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుందని చెప్పుకొచ్చారు. వర్క్ ఫ్రమ్ హోమ్ అనేది రియాలిటీ అని.. ఇంటి నుంచే ప్రపంచం మొత్తం పనిచేసే పరిస్థితి వస్తుందని.. దీనిని
ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వంలోనూ ఈ తరహా విధానాన్ని అమలు చేసే పరిస్థితులు వస్తాయని.. దేశం మొత్తం దుబారాను తగ్గించాలని మార్గనిర్దేశర చేశారు. పెద్ద పెద్ద కాన్వాయ్ వాహనాల్లో వెళ్లటం అందరికీ చాలా పెద్ద ఫ్యాషన్‌గా మారిందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. కాన్వాయ్ వాహనాల సంఖ్య తగ్గించి ప్రజాప్రతినిధులు ఆదర్శంగా నిలవాలని.. సెక్యూరిటీని కూడా కుదించుకోవాలని సూచించారు. విదేశీ పర్యటనలు తగ్గించుకోవాలని ప్రధాని మోదీ సూచించారని.. దీనిని కూడా మనం పాటిద్దామని పిలుపునిచ్చారు. మన దేశంలో, రాష్ట్రంలోనూ మంచి పర్యాటక ప్రాంతాలున్నాయని వివరించారు. ప్రజలు విదేశాలకు వెళ్లడం కంటే మన పర్యాటక ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. 'నాదేశం- నా బాధ్యత' అనే ఆలోచనను ప్రజలంతా ఆచరించాలని అన్నారు. రెండు రోజుల్లో ఈ విషయంపై చర్చించి స్పష్టమైన ప్రకటన చేస్తామని తెలిపారు. బంగారం కొనడాన్ని కూడా తగ్గించాలని ప్రధాని చెప్పారని ప్రస్తావించారు. దీనిపైనా ప్రజలు ఆలోచన చేయాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# ఏపీలో స్థానిక ఎన్నికల కసరత్తు.. సెప్టెంబర్‌లో నోటిఫికేషన్!

### సెప్టెంబర్‌లో నోటిఫికేషన్, డిసెంబర్‌లోగా ఎన్నికల పూర్తికి ప్రణాళిక

### ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా

### వార్డుల విభజన, బీసీ రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ వేగవంతం



**, మే 14,(ప్రజావినికిడి):**ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) సన్నాహాలు ప్రారంభించింది. ప్రస్తుత పాలకవర్గాల పదవీకాలం ముగియనుండటంతో, సెప్టెంబర్‌లో ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసి, డిసెంబర్ నాటికి మొత్తం ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కొత్త ఏడాదికి నూతన పాలకవర్గాలు కొలువుదీరేలా చర్యలు చేపడుతోంది.ఈ నేపథ్యంలో, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా నిన్న అమరావతిలో కీలక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, బీసీ సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శులు, కమిషనర్లు ఈ భేటీలో పాల్గొన్నారు. ఎన్నికల ఏర్పాట్లు, వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ఖరారు వంటి అంశాలపై ఆయన అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.ప్రస్తుతం రాష్ట్రంలోని 123 పురపాలక సంఘాల్లో వార్డులు, డివిజన్ల పునర్విభజన ప్రక్రియ కొనసాగుతోందని, ఇది జూన్ 26 నాటికి పూర్తికానుందని అధికారులు తెలిపారు. మరోవైపు, బీసీ రిజర్వేషన్ల ఖరారు కోసం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ తన నివేదికను జూన్‌లో ప్రభుత్వానికి అందించే అవకాశం ఉంది. ఈ నివేదిక ఆధారంగా జులైలో రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని 13,291 పంచాయతీలకు ఓటర్ల జాబితాలు ప్రచురించినట్టు సమాచారం. ఈ ఏర్పాట్లన్నీ సకాలంలో పూర్తి చేసి, షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని ఎస్ఈసీ భావిస్తోంది

# బక్రీద్ సందర్భంగా ప్రత్యేక చర్యలు

### పశువుల అక్రమ రవాణాపై నిఘా -రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 203 చెక్ పోస్టుల ఏర్పాటు

### ఘర్షణలు తలెత్తకుండా కఠిన చర్యలకు ఆదేశం -అధికారులతో డిజిపి సివి ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్,మే 14,(ప్రజావినికిడి):**ఈ నెల 27వ తేదీన జరిగే బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను పూర్తిగా నిరోధించాలని పోలీస్ అధికారులను డిజిపి సివి ఆనంద్ ఆదేశించారు. అలాగే సోషల్ మీడియాలో పుకార్లు పుట్టించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. తెలంగాణలో బక్రీద్ పండుగను పురస్కరించుకుని శాంతిభద్రతల పరిరక్షణెళి లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతోందని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, పశు సంవర్ధక శాఖ సెక్రటరీ కే. ఇలంబర్తి తదితరులతో కలిసి డీజీపీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడారు. ముఖ్యమంత్రి స్థాయిలో జరిగిన చర్చలు, అనంతరం ఉప ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశ నిర్ణయాల మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. బక్రీద్ పండుగ ఇతర పండుగల కంటే అత్యంత సున్నితమైనదని, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా రెండు వర్గాల మధ్య ఘర్షణలు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఇటీవల పశువుల అక్రమ రవాణా ఘటనలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ అమలు కోసమే ఈ వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పశువుల రవాణా విషయంలో కౌ స్లాటర్ యాక్ట్-1977, ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్-1978, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ-1960 చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో 52



అంతరాష్ట్ర చెక్ పోస్టులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 203 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు డీజీపీ వెల్లడించారు. అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలను ముమ్మరం చేయాలని, ముఖ్యంగా రానున్న 15 రోజుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే పశువుల సంతలపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. చెక్ పోస్టుల వద్ద పశువుల రవాణాకు సంబంధించిన 'ఫీట్ టు ట్రాన్స్‌పోర్టేషన్', 'ఫిట్ టు స్లాటర్' వంటి ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, పండుగ ముగిసే వరకు ఈ తనిఖీలు నిరంతరాయంగా కొనసాగాలని ఆదేశించారు. శాంతిభద్రతల విషయంలో ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని డీజీపీ హెచ్చరించారు. పశువుల రవాణాపై ఎవరికైనా అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలే తప్ప, నేరుగా రోడ్లపైకి వచ్చి ఘర్షణ వాతావరణం సృష్టించకూడదని ఖురేషీలు, గోరక్షక బృందాలకు సూచించారు. నిబంధనలు మీరి రాద్ధాంతం చేసే వారిపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు సస్పెక్ట్ షీట్లు కూడా ఓపెన్ చేస్తామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు రెండువర్గాల వారితో విడివిడిగా సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని కోరారు. పోలీస్, మున్సిపల్ పశు సంవర్ధక, రెవెన్యూ శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని, ఇందుకోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకొని సమాచారాన్ని ఎప్పటికప్పుడు పంచుకోవాలని
సూచించారు. సీజ్ చేసిన పశువులను సంరక్షించేందుకు తగిన విస్తీర్ణంలో క్యాటిల్ పాండ్‌లను ఏర్పాటు చేయాలని, అక్కడ పశువులకు అవసరమైన సౌకర్యాలు ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంచాలని, గందరగోళం సృష్టించేలా పోస్టులు పెట్టే వారిని స్టేషన్లకు పిలిపించి హెచ్చరించాలని చెప్పారు. గతంలో బక్రీద్ సందర్భంగా నమోదైన కేసులను దృష్టిలో ఉంచుకుని, ఈసారి ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. మున్సిపల్ అధికారులు బక్రీద్ పండుగ అప్రమత్తతో ఉన్నారని స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్ తెలిపారు. కౌ స్లాటర్ యాక్ట్, ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ చట్టాలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. పశుసంవర్ధక శాఖ సెక్రటరీ కె. ఇలంబర్తి మాట్లాడారు. పశువుల రవాణాకు సంబంధించిన సర్టిఫికెట్లను ఇచ్చేందుకు వెటర్నరీ డాక్టర్లను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో వెటర్నరీ డాక్టర్లు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ గోపీ, శాంతిభద్రతల డీజీపీ మహేశ్ ఎం భగవత్, ఐజీపీలు చంద్రశేఖర్ రెడ్డి, షానవాజ్ ఖాసిం, కార్తికేయ, ఇంటెలిజెన్స్ డీఐజీ భాస్కరన్ తదితరులు తగు సూచనలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, అన్ని జిల్లాల ఎస్పీలు, వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

# హాస్టల్‌లో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

**హైదరాబాద్,మే 14,(ప్రజావినికిడి):**
మాదాపూర్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ విద్యార్థిని పూజారెడ్డి ఆత్మహత్య తీవ్ర కలకలం రేపుతోంది. కాలేజీ హాస్టల్‌లో విద్యార్థిని ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. కోదాడకు చెందిన పూజారెడ్డి.. మాదాపూర్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ చదువుతోంది. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని.. బెటర్మెంట్ కోసం పరీక్షకు అప్లై చేసుకుంది. బుధవారం నుంచి ఇంటర్ బెటర్మెంట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా రాత్రి హాస్టల్‌లో విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.తోటి విద్యార్థుల గమనించి వెంటనే హాస్టల్ వార్డెన్‌కు తెలియజేశారు. విద్యార్థిని ఆత్మహత్యపై హాస్టల్ సిబ్బంది.. పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు.. విద్యార్థిని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షల ఒత్తిడితోనే ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విద్యార్థిని ఆత్మహత్యపై కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎంతో భవిష్యత్తు ఉన్న తమ బిడ్డ ఇలా ఆత్మహత్య చేసుకోవడంపై తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# ఫోక్సో కేసును కులానికి ఆపాదించే యత్నం

### ఇది కుల సమస్య కాదని గుర్తించాలన్న గంగుల

**హైదరాబాద్,మే 14,(ప్రజావినికిడి):**
కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కొడుకు సాయి భగీరథ్ విషయంలో బీఆర్ఎస్ భాధితురాలి పక్షాన ఉందని మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ నేతల ఒత్తిడితోనే కేంద్ర మంత్రి కొడుకుపై కేసు నమోదు చేశారన్నారు. బండి సంజయ్ కొడుకు పోక్సో కేసును కులానికి ఆపాదించే ప్రయత్నం చేస్తున్నారు. ఇది కుల సమస్య కాదు. లా అండ్ ఆర్డర్ సమస్య. నిన్న కరీంనగర్ లో బెదిరింపు ధోరణిలో మాట్లాడిన బండి సంజయ్ ఎవరి అంతు చూస్తావ్..? బాధితురాలిని అంతం చేస్తావా, లేకపోతే ఎవరు ప్రశ్నిస్తే వాళ్ళను అంతం చేస్తావా..? అని గంగుల ప్రశ్నించారు. చట్టానికి, పోలీసులకు బండి సంజయ్ కుమారుడు సహకరించాలన్నారు. కాగా బండి సాయి భగీరథ్‌పై ఇప్పటికే పోక్సో కేసు నమోదుచేసిన పోలీసులు.. అతడిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో తాజాగా కొన్ని సెక్షన్లను అదనంగా చేర్చారు. పోక్సో చట్టం సెక్షన్ 5(1) రెడ్ విత్ 6ను జత చేశారని తెలిసిందే. ఇంతకుముందు బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు సెక్షన్ 11 రెడ్ విత్ 12 ఆఫ్ పోక్సో చట్టం, బీఎన్ఎస్ 74, 75 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసు దర్యాప్తును మహిళా ఐపీఎస్ అధికారి రితిరాజ్‌కు అప్పగించిన నేపథ్యంలో వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి.

# పొదుపు సూత్రాలు తెలంగాణకు నిధులు మాత్రం ఆంధ్రాకా ..?

### ప్రధాని తీరుపై మండిపడ్డ కవిత

### భగీరథ్ పారిపోకుండా లుకౌట్ నోటీసులు ఇవ్వాలని డిమాండ్



**హైదరాబాద్,మే 14,(ప్రజావినికిడి):**ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చి పొదుపు సూత్రాలు చెప్పారని.. డబ్బులు మాత్రం ఏపీకి ఇచ్చారని తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యానించారు. బుధవారం మీడియాతో కవిత మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుటుంబ సభ్యులు ఆరోపణలు ఎదుర్కొంటున్నారని.. ప్రధాని సభా వేదికను బండి సంజయ్ పంచుకోకుంటే బాగుండేదని అన్నారు. ప్రధాని పర్యటనలో కేంద్ర మంత్రి పాల్గొనడం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతం వెళ్లిందన్నారు. బండి సంజయ్ కుమారుడు దేశం దాటి పోకుండా తెలంగాణ పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేయాలని కవిత అన్నారు. బండి సంజయ్ కుమారుడు తప్పు చేసినట్లు రుజువు అయితే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆడపిల్ల జీవితం నాశనం అయ్యే విధంగా సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేసిన వారిని అరెస్ట్ చేయాలని.. సోషల్ మీడియా అకౌంట్స్ బ్లాక్ చేయాలన్నారు. బాధితురాలి వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయాల్సిన అత్యుత్సాహం బీఆర్ఎస్ పార్టీకి ఎందుకని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై ప్రధాని మోదీ మాట్లాడలేదని టీఆర్ఎస్ అధ్యక్షురాలు అన్నారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇవ్వాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా కోసం కేంద్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు పోలవరం పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కలిశారని.. పోలవరం ప్రాజెక్ట్‌ను 5 సార్లు సందర్శించారని తెలిపారు. కానీ తెలంగాణ సీఎం రేవంత్ ఇప్పటి వరకు ఒక్కసారి కూడా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు వెళ్లలేదని విమర్శించారు. ఏపీ నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటోందన్నారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే వాటర్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. చెక్ డ్యామ్‌లు కట్టి నీటి వనరులను సద్వినియోగం చేస్తామని తెలిపారు. ప్రధాని పర్యటనపై బీఆర్ఎస్ ఒక్క మాట మాట్లాడలేదని విమర్శించారు. ÷ఎలగణనలో ఓబీసీ కాలమ్ పెట్టాలని కవిత డిమాండ్ చేశారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించడానికి దేశం మొత్తం తిరుగుతామని చెప్పారు. పోలవరం, బనకచర్లపై రిట్ పిటిషన్ వేయనున్నట్లు కవిత తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి వినతి పత్రం ఇస్తామన్నారు. నీట్ లాంటి జాతీయ పరీక్ష పేపర్ల లీక్ ఘటన అంశాన్ని కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడుకోవద్దని హెచ్చరించారు. టీఆర్ఎస్ జెండా పండుగలో తాను పాల్గొంటానని తెలిపారు. తెలంగాణ రాజకీయ శూన్యతను భర్తీ చేయడానికి తెలంగాణ రక్షణ సేన పుట్టిందని కవిత పేర్కొన్నారు.

# వేసవి సెలవుల్లో చదువును విస్మరించవద్దు

### : వర్ధన్నపేట ఎస్సై సాయిబాబు



**వర్ధన్నపేట/మే 14,(ప్రజావినికిడి):**
వేసవి సెలవులను కేవలం వినోదానికే పరిమితం చేయకుండా, విద్యార్థులు చదువుపై సాధన కొనసాగించాలని వర్ధన్నపేట ఎస్సై సాయిబాబు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులు సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువులో వెనుకబడకుండా ఉండేందుకు ప్రతిరోజూ కనీసం రెండు గంటల సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించాలని కోరారు. చదువుతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని, సెలవుల్లో నేర్చుకునే అంశాలు భవిష్యత్తు తరగతులకు పునాదిగా మారుతాయని పేర్కొన్నారు.మరోవైపు, వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా విద్యార్థులు మధ్యాహ్నం వేళ బయట తిరగవద్దని, నిరంతరం నీరు తాగుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని హితవు పలికారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వారిని చదువు దిశగా ప్రోత్సహించాలని ఎస్సై సాయిబాబు సూచించారు. సెలవులను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు ఆయన సందేశాన్ని ఇచ్చారు.

# పుదుచ్చేరి సిఎంగా రంగస్వామి ప్రమాణం

### వరుసగా ఐదోసారి సిఎంగా బాధ్యతలు

### ప్రమాణ కార్యక్రమానికి నితిన్ నబీన్ హాజర్

### ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని



**పుదుచ్చేరి,మే 14,(ప్రజావినికిడి):**
కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ఎన్.రంగస్వామి ప్రమాణ స్వీకారం చేశారు. లోక్ భవన్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ కె. కైలాసనాథన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. నమశ్శివాయం, మల్లాడి కృష్ణారావు కేబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. పుదుచ్చేరిలో ఐదోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఎన్.రంగస్వామి రికార్డు నెలకొల్పారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సహా పలువురు సీనియర్ బీజేపీ నాయకులు, మిత్రపక్షాల నేతలు, ఎన్నికైన ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం మీడియాతో రంగస్వామి మాట్లాడారు. ఎన్డీయే కూటమికి మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిపై మరింతగా దృష్టి సారిస్తుందని, ప్రజా సంక్షేమం కోసం అవసరమైన అన్ని పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. పుదుచ్చేరిని ప్రధాన అభివృద్ధి, పర్యాటక కేంద్రంగా మార్చనున్నట్లు కూడా ఆయన తెలిపారు. పుదుచ్చేరిని సింగపూర్‌లా అభివృద్ధి చేయబోతున్నట్లు సీఎం రంగస్వామి ప్రకటించారు. పుదుచ్చేరిలో ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంపై ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ప్రమాణ స్వీకారం చేసిన ముఖ్యమంత్రి, మంత్రులకు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టు పెట్టారు. 'పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎన్.రంగస్వామికి అభినందనలు. అక్కడ అభివృద్ధి ప్రస్థానాన్ని బలోపేతం చేసిన అనుభవజ్ఞుడైన, సమర్థవంతమైన పరిపాలకుడిగా ఆయన తనదైన ముద్ర వేశారు. కొత్త మంత్రులు పురోగతికి దోహదపడతారని, అక్కడి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తారని విశ్వాసం వ్యక్తం చేస్తున్నాను' అని మోదీ పోస్టు చేశారు. 30 స్థానాలున్న పుదుచ్చేరి అసెంబ్లీకి ఇటీవల ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి మెజారిటీ సీట్లు గెలుచుకుంది. ఈ కూటమిలో సీఎం రంగస్వామికి చెందిన ఆల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ 12 స్థానాలు గెలుచుకోగా, బీజేపీ 4 స్థానాలను కైవసం చేసుకుంది. ఏఐఏడీఎంకే, ఎల్జేకే చెరో స్థానాన్ని దక్కించుకున్నాయి. మరోవైపు ప్రతిపక్షాలైన డీఎంకే 5 స్థానాలు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఒక స్థానం గెలుచుకున్నాయి. ఇక, విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం రెండు స్థానాలతో ఖాతా తెరిచింది.

# అత్యధిక మార్కులు సాధించిన బిసి విద్యార్థులకు పురస్కారం

### నేడు మంత్రి పొన్నం చేతుల మీదుగా అందచేత

**హైదరాబాద్,,మే 14,(ప్రజావినికిడి):**రాష్ట్రంలోని బీసీ గురుకుల, బీసీ హాస్టల్‌లో ఉంటూ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన బీసీ విద్యార్థులకుఈనెల 14న ప్రతిభా పురస్కారాలు అందిస్తుందని రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పదో తరగతి, ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బంజారా హిల్స్‌లోని కొమరం భీమ్ ఆదివాసి భవన్‌లో జరిగే కార్యక్రమంలో పురస్కారాలు అందిస్తున్నామని వివరించారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ప్రతిభావంతులైన 508 మంది విద్యార్థులను సన్మానిస్తామన్నారు. పదో తరగతి ఫలితాలలో మహాత్మా జ్యోతిభా పూలే నుంచి 147 మంది విద్యార్థులు (576 కటాఫ్), బీసీ హాస్టల్ విద్యార్థులు 67 మంది (550 కటాఫ్) కి మొత్తం 214 మంది విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్నామని ఒక ప్రకటనలో తెలిపారు.ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం 137 మంది విద్యార్థులు (988 కటాఫ్/1000), 28 మంది బీసీ హాస్టల్ విద్యార్థులు మొత్తం 165 మంది విద్యార్థులను సత్కరిస్తామని అన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో (467/437/493 కటాఫ్) సాధించిన 107 మంది విద్యార్థులు, 22 మంది బీసీ హాస్టల్ విద్యార్థులు మొత్తం 129 మంది విద్యార్థులను సన్మానిస్తామని ఆయన తెలిపారు.

# గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్య

**మెదక్,,మే 14,(ప్రజావినికిడి):** మెదక్ జిల్లా శివంపేట మండలం శభాష్‌పల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని ఓ వ్యక్తిని హత్య చేసి పడేయడంతో స్థానికంగా కలకలం రేగింది. బుధవారం ఉదయం అటుగా వెళ్లిన పలువురు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తూప్రాన్ సీఐ వెంకట రాజా గౌడ్, స్థానిక ఎస్ఐ మధుకర్ రెడ్డి అక్కడికి చేరుకొని పరిశీలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ ఘట్‌కేసర్ మండలం అంకుశాపూర్ గ్రామానికి చెందిన ఎండీ అన్వర్ (50) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నట్టు గుర్తించారు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అతడిని హత్య చేసి శభాష్‌పల్లి గ్రామ శివారులో పడేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. హత్యకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# రోప్ తెగి కిందపడిన లిఫ్ట్... తెలంగాణ మంత్రికి తప్పిన ప్రమాదం

### కరీంనగర్ ఒక ప్రైవేటు ఆసుపత్రిలో ప్రమాదం -రైతును పరామర్శించి వస్తుండగా ఘటన

### మొదటి అంతస్తు నుంచి కిందపడిన లిఫ్ట్ -మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు స్వల్ప గాయాలు




తెలంగాణ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు పెను ప్రమాదం తప్పింది. ఆయన లిఫ్ట్‌లో ఉండగా రోప్ తెగిపోయింది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఆయనను బయటకు తీశారు. కరీంనగర్‌లో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో ఉన్న ఒక రైతును పరామర్శించేందుకు ఆయన వెళ్ళిన సమయంలో ఈ ప్రమాదం జరిగింది. లిఫ్ట్ రోప్ తెగిన ఘటనలో మంత్రికి స్వల్ప గాయాలయ్యాయి. వైద్యులు ఆయనకు చికిత్స అందించారు.మంత్రి రైతును పరామర్శించేందుకు మొదటి అంతస్తు నుంచి కిందకు వచ్చేందుకు లిఫ్ట్ ఎక్కారు. లిఫ్ట్ కిందకు వస్తుండగా సాంకేతిక లోపం కారణంగా రోప్ తెగి ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో లిఫ్ట్ ఫస్ట్ ఫ్లోర్ నుంచి కిందకు పడిపోయింది. దీంతో మంత్రి లిఫ్ట్‌లో ఇరుక్కుపోయారు. వెంటనే స్పందించిన భద్రతా సిబ్బంది, పోలీసులు లిఫ్ట్ తలుపు తెరిచి మంత్రిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు.

# బండి భగీరథ్ అప్‌స్కాండింగ్

### నగరంలో పలుచోట్ల పోస్టర్ల కలకలం



**హైదరాబాద్‌మే 14,(ప్రజావినికిడి):**
కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అవడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. నగరంలోని పలు ప్రాంతాల్లో బండి భగీరథ్ అబ్‌స్కాండింగ్ అంటూ పోస్టర్లు వెలిశాయి. ఈ పోస్టర్లలో 'బండి భగీరథ్ పరారీలో ఉన్నాడు. ఆచూకీ తెలిస్తే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో తెలియజేయండి' అని రాసి ఉంది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఈ పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా బండి భగీరథ్ మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉందని.. అతడు పరారీలో ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు. భగీరథ్ కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. తనపై లైంగిక దాడి చేశాడంటూ భగీరథ్‌పై బాలిక ఫిర్యాదు చేసింది. ఈ కేసుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీరియస్‌గా స్పందిస్తూ.. తక్షణమే చర్యలు తీసుకోవాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించారు. దీంతో ఈ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేస్తూ డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. కేసును దర్యాప్తు చేస్తున్న సిట్.. భగీరథ్‌కు నోటీసులు జారీ చేసింది. ఈరోజు(బుధవారం) మధ్యాహ్నం 2 గంటలకు విచారణకు రావాల్సిందిగా నోటీసుల్లో పేర్కొంది. మరోవైపు తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ భగీరథ్.. తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

# అమూల్ పాలధరలు పెంపు

### లీటర్‌కు రెండు రూపాయలు పెంచిన సంస్థ

### నేటినుంచే పెంచిన ధరలు అమల్లోకి -అదే బాటలో మదర్ డెయిరీ కూడా పెంపు




**హైదరాబాద్,,మే 14,(ప్రజావినికిడి):** అమూల్ బ్రాండ్‌పై పాల ఉత్పత్తులు విక్రయించే గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ పాల ధరలను పెంచింది. లీటర్‌కు రూ.2 చొప్పున పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మే 14 నుంచి పెరిగిన ధరలు అమల్లోకి రానున్నాయి. అమూల్ స్టాండర్డ్ మిల్క్, గేదె పాలు, ఆవు పాలు, గోల్డ్, స్లిమ్ / ట్రిమ్, టీ-స్పెషల్ పాల ధరలు లీటరుకు రూ.2 చొప్పున పెరగనున్నాయి. గతేడాది మే 1న చివరి సారిగా ధరలు సవరించింది. ఉత్పత్తి వ్యయం పెరిగిన నేపథ్యంలో ధరల పెంపు నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని అమూల్ తెలిపింది. పశవుల దాణా, ప్యాకేజింగ్ ఖర్చులు, చమురు ధరలు పెరుగుదల దీనికి కారణమని పేర్కొంది. పాల రకాన్ని బట్టి లీటరుకు 2.5 నుంచి 3.5 శాతం మేర ధరలు పెరుగుతున్నాయని, ఆహార పదార్థాల ద్రవ్యోల్బణంతో పోలిస్తే ఈ పెంపు తక్కువేనని పేర్కొంది.మదర్ డెయిరీ కూడా పాల ధరలను పెంచింది. లీటరుకు రూ.2 చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించింది. మే 14 నుంచి పెరిగిన పాల ధరలు అమల్లోకి రానున్నాయని తెలిపింది. పాల ధరలను అమూల్, మదర్ డెయిరీ పెంచిన నేపథ్యంలో ఇతర కంపెనీలూ ఇదే బాటలో పయనించే అవకాశం ఉంది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ఎన్‌టిఎ వైఫల్యంతో విద్యార్థులకు శాపం !

**మే 14,(ప్రజావినికిడి):**
కొందరు మాఫియాతో చేతులు కలపడం వల్లనే పేపర లీకేజీలు జరుగుతున్నాయి. వారిని గుర్తించాలి. కఠినంగా శిక్షించాలి. నీట్ పేపర్ దోషులకు కఠిన శిక్షలు పడితే తప్ప ఇలాంటి తప్పిదాలు పునరావృతం అవుతూనే ఉంటాయి. ఒకప్పుడు టెన్త్ లేదా ఇంటర్ పరీక్ష పేపర్లు లీక్ అయితే సంబంధిత మంత్రి రాజీనామా చేసేవారు. అంతగా నైతిక బాధ్యత వహించేవారు. కానీ నీట్ పేపర్ లీక్ కావడం లక్షల మంది విద్యార్థుల భవితవ్యాన్ని ప్రమాదంలో పడేసింది. దేశంలో వైద్య విద్య పట్టణ ప్రాంతాల్లోని ఎగువ మధ్యతరగతి, ఉన్నత వర్గాల వారికే అందుబాటులో ఉంది. సామాన్యులు వైద్య విద్య చదివించడం దాదాపు అసాధ్యమైన పరిస్థితి ఏర్పడింది. గతంలో ప్రతి రాష్ట్రం ఎంసెట్ నిర్వహించుకోవడంతో ఇలాంటి బాధలు ఉండేవి కావు. నీట్‌ను తమిళనాడు అస్సలు ఒప్పుకోలేదు. కానీ 2017లో మోడీ ప్రభుత్వం కేంద్రీకరణ విధానాల్లో భాగంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్‌టిఎను తీసుకొచ్చి, రాష్ట్రాల పరిధిలో ఉన్న వైద్య విద్య ప్రవేశార్హత నీట్ లో భాగం చేశారు. అన్ని పరీక్షలను తన చెప్పు చేతల్లో ఉంచుకోవాలన్న మోడీ ప్రభుత్వ విధానంతో లీక్ లు, అవకతవకలు షరా మామూలుగా మారిపోయాయి. నీట్ విధానం అన్యాయమని, ఈ విధానాన్ని రద్దు చేసి, వికేంద్రీకరించాలని దక్షిణాది రాష్ట్రాలు కేరళ, తమిళనాడు, కర్ణాటక అసెంబ్లీలో తీర్మానాలు






చేశాయి. దాదాపు 400 మందితో ఏర్పడిన ఎన్‌టిఎ నీట్ సహా 46 పరీక్షలను సమన్వయం చేయాల్సి ఉండటం, అందులోనూ అనర్హులు, అక్రమార్కులు భాగస్వాములు కావడం వల్ల ఇవాళ నీట్ పరీక్ష రద్దుకు కారణమయ్యింది. గతంలో నాలుగు సార్లు నీట్, ఒకసారి యుజిసి నెట్ లీక్ కావడమే ఇందుకు నిదర్శనం. 2024లో నీట్ యుజి పరీక్ష అవకతవకలపై బీహార్‌లో అరెస్టులు, సకాలంలో పేపర్ ఇవ్వక పోవడం వల్ల గ్రేస్ మార్క్ లు ఇవ్వాల్సి రావడం సహా ఎన్నో అంశాలు కలకలం రేపాయి. చర్చనీయాంశం అయ్యాయి. పూర్తి భద్రతా ప్రోటోకాల్ పాటించామని, జిపిఎస్ ట్రాక్ చేసిన వాహనాలు, ఎ.ఐ నియంత్రిత సిసి టివి, బయోమెట్రిక్, 5 జి జామర్లు వంటి చర్యలు తీసుకున్నామని ఎన్‌టిఎ చెబుతున్నా అక్రమాలు జరుగుతున్నాయంటే పేపర్ లీక్ మాఫియాను అరికట్టడంలో వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. విద్యార్థుల కలలను భగ్నం చేసే పేపర్ లీక్ లను అడ్డుకోకపోగా, కనీసం నోరుమెదపని ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉండటం సిగ్గుచేటు. పరీక్షా పే చర్చ అంటూ విద్యార్థులతో చర్చించే ప్రధానికి ఏటా జరుగుతున్న పేపర్ లీక్ లపై కనీసంగా మాట్లాడడం లేదు. అవిశ్రాంతంగా శ్రమించి ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులు మరోసారి మానసిక ఒత్తిడి, తల్లిదండ్రులపై ఆర్థిక భారం, అనిశ్చితితో శిక్ష అనుభవిస్తున్నారు. వ్యవస్థ ఇన్ని లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుంటే మోడీ ఇప్పుడు ఎందుకు మాట్లాడరన్నదే ప్రశ్న. నిజానికి నీట్ పరీక్షను తప్పించి ఆయా రాష్ట్రాలకు మునుపటి మాదిరి ఎంసెట్ నిర్వహించుకునే వెసలుబాటు కల్పిచడం మేలు. లేదా నీట్ వైఫల్యాలపై చర్యలు తీసుకోవాలి. సిబిఐ విచారణకు ఆదేశించినా అది ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది కూడా అనుమానమే. పేపర్ లీక్ పై కేంద్రప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలి. బాధ్యులకు కఠిన శిక్షలు పడేలా చేయాలి. విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడకుండా తక్షణ చర్యలు చేపట్టాలి. ఈ నెల 3వ తేదీన నిర్వహించిన నీట్ (యూజీ)-2026 పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసింది. పరీక్షను మళ్లీ నిర్వహించటం అనేక మంది విద్యార్థులకు, వారి కుటుంబాలకు ఇబ్బంది కలిగించే నిర్ణయమేనని చెప్పకతప్పదు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై సీబీఐ దర్యాప్తునకు కేంద్రం ఆదేశించింది. పరీక్ష రద్దు నేపథ్యంలో లక్షలాది మంది విద్యార్థులు మళ్లీ పరీక్ష రాయాల్సిన దుస్థితి నెలకొంది. సాధారణంగా ఈ అక్రమాలు గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతుంటాయి. అయితే, ఈసారి ఏజెంట్లు ఒకర్ని మించి మరొకరు సొమ్ము చేసుకునే ఉద్దేశంతో విచ్చలవిడిగా పేపర్‌ను అమ్మటంతో ఈ వ్యవహారం బయటపడింది. ఇలా లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం కేవలం కేంద్ర వైఫల్యంగానే చూడాలి. వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) కుంభకోణాలకు ఆలవాలంగా మారడం గర్హనీయం. ఈ నెల 3న జరిగిన నీట్ యుజి 2026 పరీక్ష ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని తేలడంతో పరీక్షను రద్దు చేసి, సిబిఐ విచారణకు జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్‌టిఎ) ఆదేశించింది. పేపర్ లీక్, పరీక్ష రద్దుతో 22 లక్షల మంది విద్యార్థులు అనవసరమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. పరీక్షలకు 42 గంటల ముందే రాజస్థాన్‌లోని సీకర్‌లో వాట్సాప్ లో అందుబాటు లోకి వచ్చిన 'అంచనా పేపర్' లో కెమిస్ట్రీ, బయాలజీ విభాగాల్లో 120 నుంచి 140 ప్రశ్నలు నీట్ పరీక్షలో వచ్చాయంటే పరీక్ష నిర్వహణలో డొల్లతనం వెల్లడవుతుంది. ఈ పేపర్‌లోని ప్రశ్నలు ప్రిపేరైన విద్యార్థులు 720 మార్కుల్లో 600 వరకు స్కోర్ చేసి ఉండవచ్చున్నది నిపుణుల మాట. ఈ నెల 1 నుండి అంచనా పేపర్ అభ్యర్థులకు చేరిందని, రూ.20 వేల నుంచి రూ.2 లక్షల వరకూ విక్రయించారని అధికారులు గుర్తించి, పలువురు నిందితులను అరెస్టు చేశారు. ఏదేమైనా ఇలాంటి విషయాల్లో కేంద్రం కఠినంగా వ్యవహరించాల్సి ఉంది.

## ఇంటర్ పరీక్ష రాసిని మాజీ మావోయిస్ట్ దేవ్‌జీ

**జగిత్యాల, మే 14,(ప్రజావినికిడి):**
మావోయిస్టు మాజీ అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ ఇంటర్ పరీక్షకు హాజరయ్యారు. దాదాపు 45 ఏళ్ల తర్వాత జగిత్యాల జిల్లా కోరుట్లలో ఆయన ఈ పరీక్ష రాశారు. 1980-82లో దేవ్‌జీ కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ చదివారు. విద్యార్థి రాడికల్ యూనియన్‌లో పనిచేస్తున్న సమయంలో సెకండియర్ తెలుగు పరీక్షను ఆయన బహిష్కరించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మావోయిస్టు ఉద్యమాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిసిన ఆయన.. ఇంటర్ బోర్డు ప్రత్యేక అనుమతితో పరీక్ష



రాశారు. బుధవారం కోరుట్లలోని మ్యాస్టో జూనియర్ కళాశాలలో తెలుగు పరీక్ష రాశారు. న్యాయవాద కోర్సు చేసి పేదల కోసం పనిచేస్తానని దేవ్‌జీ చెప్పారు.

-------

## దోపిడీ నేపాలీ ముఠా కోసం గాలింపు

హైదరాబాద్, **మే 14,(ప్రజావినికిడి):**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ ఠాణా పరిధిలో నేపాలీ దోపిడీ దొంగలు రెచ్చిపోయిన ఘటనపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. కౌకూరు గోల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో విశ్రాంత ప్రొఫెసర్ మురళీధర్ మోహన్(68), భార్య డాక్టర్ విజయలక్ష్మి(58)ని బంధించి 75 తులాల బంగారం, 20 కిలోల వెండితో నిందితులు పరారైన విషయం తెలిసిందే. దోపిడీలో 8 మంది సభ్యుల నేపాలీ ముఠా పాల్గొన్నట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. వృద్ధ దంపతులను ఇంట్లో బంధించిన తర్వాత నిందితులు ఆటో బుక్ చేసుకుని అక్కడి నుంచి వెళ్లి పోయిన సీసీ టీవీ ఫుటేజ్‌ని పోలీసులు సేకరించారు. ఘటన తర్వాత ప్రొఫెసర్ ఇంట్లోని హార్డ్ డిస్క్‌లు, సీసీ కెమెరాలను నిందితులు ధ్వంసం చేసినట్టు పోలీసులు తెలిపారు. మల్కాజిగిరి సీపీ సుమతి ఘటనాస్థలిని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. నిందితులంతా ఇప్పటికే నేపాల్ చేరుకుని ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

## కస్టోడియల్ టార్చర్ కేసు

### జగన్‌ను వదిలే ప్రసక్తి లేదు -డిప్యూటి స్పీకర్ రఘురామ

**భీమవరం,, మే 14,(ప్రజావినికిడి):**
):వైసీపీ హయాంలో తనపై నమోదైన కస్టోడియల్ టార్చర్ కేసును వదిలే ప్రసక్తే లేదని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, తెలుగుదేశం పార్టీ ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు స్పష్టం చేశారు. ఈ కేసుపై తాను పట్టువదలని విక్రమార్కుడిలా న్యాయం కోసం ప్రయత్నిస్తున్నానని వ్యాఖ్యానించారు. బుధవారం పశ్చిమగోదావరి జిల్లాలో



రఘురామ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. గురువారం తన పుట్టినరోజు అని.. తన కేసు రేపటికి ఐదేళ్లు అవుతుందని తెలిపారు. తన కేసులో మూడో ముద్దాయిగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఉన్నారని ప్రస్తావించారు. మొదటి ముద్దాయి విచారణకు రాయల్‌గా వచ్చి రాయల్‌గా వెళ్లిపోయారని రఘురామ విమర్శించారు. రెండో ముద్దాయిని, మూడో ముద్దాయిని ఇంకా విచారణకు ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. ఈ కేసులో జగన్ రెడ్డి, సునీల్ కుమార్ పేర్లు ఉన్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం పోలవరం పనులను శరవేగంగా పూర్తి చేస్తోందని తెలిపారు. 2027 జూన్‌లో పోలవరం పూర్తి అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారని అన్నారు. పోలవరంతో పాటు తన కస్టోడియల్ టార్చర్ కేసును కూడా పూర్తి చేస్తారనే నమ్మకం తనకు ఉందని చెప్పుకొచ్చారు. తనపై మహాసేన రాజేశ్ పెట్టిన పోస్టును చూశానని తెలిపారు. జగన్ రెడ్డిని ఇప్పటివరకు తాను ఎందుకు ప్రశ్నించలేదని రాజేశ్ అడిగారని చెప్పారు. ఈ విషయంపై ఆయనతో మాట్లాడతానని అన్నారు. జగన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడే ఆయన చేసిన దారుణాల గురించి తాను మాట్లాడానని చెప్పుకొచ్చారు. రచ్చబండ ద్వారా జగన్ రెడ్డిని ఓడించే వరకు మాట్లాడానని తెలిపారు. ఎన్నికల్లో జగన్ దారుణంగా ఓడిపోయారని విమర్శించారు. ఇంకా జగన్ గురించి తాను మాట్లాడేది ఏముందని రఘురామ ప్రశ్నించారు.

## రాధన్ పండిట్ వెట్రివేల్ విషయంలో యూటర్న్

### విమర్శలు రావడంతో నియామకాన్ని రద్దు చేస్తే ఉత్తర్వులు

**చెన్నై,, మే 14,(ప్రజావినికిడి):**
జ్యోతిష్యుడు రాధన్ పండిట్ వెట్రివేల్ విషయంలో తమిళనాడు సీఎం విజయ్ వెనక్కు తగ్గారు. ఆయనను తన ఓఎస్‌డీగా నియమిస్తూ ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేశారు. ఒక జ్యోతిష్యుడిని ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా నియమించడం ఏమిటని ప్రతిపక్షాలు, మిత్రపక్షాల నుంచి విమర్శలు వచ్చిన నేపథ్యంలో సీఎం విజయ్ వెనక్కు తగ్గారు. వెట్రివేల్‌కు గతంలో ఇచ్చిన నియామక ఉత్తర్వులను రద్దు చేసినట్టు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు జారీ చేశారు. తాజాగా అసెంబ్లీలో జరిగిన బలపరీక్షలో సీఎం విజయ్ నెగ్గిన విషయం తెలిసిందే. అయితే, విశ్వాస పరీక్షకు ముందు వీసీకే ఎమ్మెల్యే వాణి అర్సు ఓఎస్‌డీ అంశాన్ని లేవనెత్తారు. శాస్త్రీయత, తార్కిక ఆలోచనా ధోరణితో ముందుకు సాగాలని అన్నారు.



మూఢనమ్మకాలను పక్కనపెట్టాలని చెప్పారు. 'మన ప్రభుత్వం జ్యోతిష్యానికి కాక శాస్త్రీయ దృక్పథానికి ప్రాధాన్యం ఇవ్వాలి' అని అసెంబ్లీ వేదికగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో రాధన్ నియామక ఉత్తర్వులను ఉపసంహరించుకున్నామని ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. రిక్కి రాధన్ పండిట్ వెట్రివేల్ దగ్గర విజయ్ జ్యోతిష సలహాలు తీసుకుంటుంటారు. ఎన్నికలకు ముందే ఆయన టీవీకే విజయాన్ని ఊహించారు. జయలలిత సహా పలువురు ప్రముఖ రాజకీయ నాయకులకు కూడా ఆయన సలహాలు ఇచ్చేవారు. మంగళవారం ముఖ్యమంత్రికి ప్రత్యేక విధుల అధికారి గా వెట్రివేల్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అయితే దీనిపై అన్ని పార్టీల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. ఆ విమర్శలపై విజయ్ స్పందిస్తూ.. ఆ నియామకాన్ని పునఃసమీక్షిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఓఎస్డీ బాధ్యతల నుంచి వెట్రివేల్‌ను తప్పిస్తూ విజయ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బలపరీక్ష అనంతరం ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

## కళ్లాల సౌకర్యం లేక రైతులకు నష్టం

### అకాల వర్షంతో తడిసి ముద్దవుతున్న ధాన్యం -తక్కువ ధరలకు దళారులకు అమ్ముకునే దుస్థితి

**కాకినాడ,, మే 14,(ప్రజావినికిడి):** ధాన్యాన్ని ఆరబోసుకునేందుకు కళ్లాల సౌకర్యం లేకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రధాన రహదారుల వెంబడి కొంతమంది రైతులు ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. 17 శాతం తేమ ఉండాలనే రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. సుమారు నాలుగు రోజుల పాటు ఎండలో ధాన్యాన్ని ఆరబోయాల్సి వస్తోంది. ఇటీవల రెండుసార్లు కురిసిన వర్షాలకు ధాన్యం తడిసిపోయింది. దీంతో, పచ్చి ధాన్యాన్ని దళారులకే తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. 75 కిలోల సాధారణ రకానికి రూ.1,725, 'ఏ' గ్రేడ్ రకానికి రూ.1,740 మద్దతు ధర ఇవ్వాలి. దళారులు కొన్ని ప్రాంతాల్లో 1250 నుంచి రూ.1300, మరికొన్ని ప్రాంతాల్లో రూ.1,400 మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీంతో, బస్తాపై రైతులు రూ.300 నుంచి రూ.400 వరకూ నష్టపోయారు. దళారికి 75 కిలోల బస్తా రూ.1,400కు అమ్ముకోవాల్సి వచ్చిందని వాపోయారు. 70 శాతం మంది ఈ విధంగానే ధాన్యాన్ని అమ్ముకున్నారని తెలిపారు. ప్రభుత్వం



సకాలంలో కొనుగోలు ప్రక్రియ ప్రారంభించలేదు. తేమ శాతం నిబంధన వంటి కారణాల వల్ల వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. 75 కిలోల బస్తాను రూ.1,400 కే ఇచ్చేయాల్సి వచ్చిందని వాపోయారు. ధాన్యం కొనుగోళ్లలో దళారుల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. దీంతో, మద్దతు ధర లభించక అన్నదాతలు నష్టపోతున్నారు. కాకినాడ జిల్లాలో ఇప్పటికే 90 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వచ్చింది. ఇందులో ప్రభుత్వం కొన్నది 1.30 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే. ఈ ఏడాది రబీలో ఎకరాకు సుమారు 45 బస్తాల దిగుబడి వచ్చింది. కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తున్న ధాన్యాన్ని నిబంధనల పేరుతో తిరస్కరిస్తుండడం, మేఘాలు, వర్షాలు భయపెడుతుండడంతో రైతులు గత్యంతరంలేని పరిస్థితుల్లో దళారులను తెగనమ్ముకోవాల్సి వస్తోంది. ఈ ఏడాది రబీ సీజన్లో కాకినాడ జిల్లాలో 1.87 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. 6.76 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకూ 1.65 లక్షల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. సుమారు ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యింది. ఇందులో 1.30 లక్షల మెట్రిక్ టన్నుల (21.67 శాతం) ధాన్యాన్ని మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసింది. 3.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని దళారులు కొనుగోలు చేశారు. మిగిలిన ధాన్యం కళ్లాల్లోనే ఉంది. వాతావరణ పరిస్థితులు భయపెడుతున్న నేపథ్యంలో వరి కోత, నూర్పిడి పనులను 95 శాతం మేర యంత్రాల ద్వారానే పూర్తి చేస్తున్నారు.

## ఎయిర్ ఇండియా సంచలన నిర్ణయం : పలు అంతర్జాతీయ సర్వీసులు నిలిపివేత

**న్యూఢిల్లీ,,మే 14,(ప్రజావినికిడి):** ఎయిర్ ఇండియా విమానయాన సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై పలు అంతర్జాతీయ విమాన సర్వీసులను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఇంధన ధరల పెరుగుదల, గగనతల ఆంక్షల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు మొత్తం ఆరు ప్రధాన అంతర్జాతీయ మార్గాల్లో విమానాలను నిలిపివేస్తున్నట్లు ఓ ప్రకటన జారీ చేసింది. ఢిల్లీ-చికాగో, ముంబై-న్యూయార్క్, ఢిల్లీ-షాంఘై, చెన్నై-సింగపూర్, ముంబై-ఢాకా, ఢిల్లీ-మాలే రూట్లలో సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు పేర్కొంది. ఈ నిర్ణయం జూన్ నుంచి




ఆగస్టు మధ్యకాలంలో అమలులో ఉంటుందని తెలిపింది.
నష్టాల దృష్ట్యా ఇప్పటికే కొన్ని మార్గాల్లో సర్వీసులను ఎయిర్ ఇండియా తగ్గించింది. ఆ నిర్ణయాన్ని మరికొన్ని రూట్లకు విస్తరిస్తూ తాజాగా ప్రకటన జారీ చేసింది. దీని ప్రకారం ఎయిర్ ఇండియా సంస్థ ప్రతి నెలా 1,200కు పైగా అంతర్జాతీయ విమాన సర్వీసులను నడపనుంది. వీటిలో ఉత్తర అమెరికాకు వారానికి 33, ఐరోపాకు 47, యూకేకు 57, ఆస్ట్రేలియాకు 8, ఫార్ ఈస్ట్, ఆగ్నేయాసియా, సార్క్ ప్రాంతాలకు 158 విమానాల చొప్పున నడవనున్నాయి. అలాగే మారిషస్‌కు వారానికి ఏడు విమాన సర్వీసులు ఉన్నట్లు పేర్కొంది. కాగా, నష్టాల దృష్ట్యానే ఎయిర్ ఇండియా సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.



# ఫేక్ న్యూస్‌పై నిప్పులు చెరిగిన ప్రీతి జింటా

ఐపీఎల్ 2026 సీజన్ క్లైమాక్స్‌కు చేరువవుతున్న వేళ మైదానంలో ఆట కంటే బయట జరుగుతున్న ప్రచారమే ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా పంజాబ్ కింగ్స్ జట్టులో విభేదాలు ఉన్నాయని, ప్లేయర్ల మధ్య సమన్వయం లోపించిందంటూ వస్తున్న వార్తలపై ఆ జట్టు సహ యజమాని, బాలీవుడ్ నటి ప్రీతి జింటా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియాలో తన జట్టు పరువు తీసేలా అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదని ఆమె గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఈ ఏడాది ఐపీఎల్ టోర్నీని పంజాబ్ కింగ్స్ అద్భుతంగా ప్రారంభించింది. వరుస విజయాలతో పాయింట్ల పట్టికలో టాప్‌లో నిలిచిన ఈ జట్టు, గత నాలుగు మ్యాచ్‌ల్లో వరుస ఓటములను చవిచూసింది. దీంతో ఒక్కసారిగా సమీకరణాలు మారిపోయాయి. ఇప్పటివరకు ఆడిన 11 మ్యాచ్‌ల్లో 6 విజయాలతో నాలుగో స్థానంలో ఉన్నప్పటికీ, తదుపరి మ్యాచ్‌లు ఆ జట్టుకు చావో రేవో లాంటివి. ఈ క్లిష్ట సమయంలో జట్టులో క్రమశిక్షణ లేదని, వ్యూహాలు ఫలించడం లేదని సోషల్ మీడియాలో విమర్శలు మొదలయ్యాయి.తన జట్టుపై వస్తున్న ట్రోల్స్, రూమర్లపై ప్రీతి జింటా సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "గేమ్ గురించి చర్చలు చేయడం, విమర్శించడం సహజమే. కానీ ఉద్దేశపూర్వకంగా మా ఆటగాళ్ల పరువుకు భంగం కలిగించేలా కథనాలు సృష్టించడం కరెక్ట్ కాదు. బాధ్యతాయుతమైన మీడియా సంస్థలు నిరాధారమైన వార్తలను వ్యాప్తి చేయవద్దని కోరుతున్నాను" అంటూ ఆమె అసహనం వ్యక్తం చేశారు. కేవలం పాపులారిటీ కోసం జట్టు ప్రతిష్టను దెబ్బతీయడం సరికాదని ఆమె హితవు పలికారు. కేవలం ప్రీతి జింటా మాత్రమే కాకుండా, పంజాబ్ కింగ్స్ మేనేజ్మెంట్ కూడా ఈ విషయంపై ఘాటుగా స్పందించింది. సరదా సంభాషణలు, అభిప్రాయాలను తాము గౌరవిస్తామని, కానీ చౌకబారు పబ్లిసిటీ కోసం అబద్ధాలు చెబితే ఊరుకోమని స్పష్టం చేసింది. ఆటగాళ్ల మధ్య గొడవలు ఉన్నాయంటూ జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని ఫ్రాంచైజీ తేల్చి చెప్పింది. అన్ని వివాదాలను పక్కన పెట్టి ఇప్పుడు పంజాబ్ జట్టు ధర్మశాల వేదికగా గురువారం ముంబై ఇండియన్స్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ పంజాబ్ కింగ్స్‌కు అత్యంత కీలకం. ఇందులో గెలిస్తేనే ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా ఉంటాయి. ఒకవేళ ఓడిపోతే మాత్రం టోర్నీ నుంచి నిష్క్రమించే ప్రమాదం ఉంది. మరి ఈ ఒత్తిడిని తట్టుకుని పంజాబ్ ప్లేయర్లు ఎలా రాణిస్తారో చూడాలి.

# సన్ రైజర్స్ బ్యాటింగ్ వైఫల్యం



ఐపీఎల్ 2026 సీజన్ లో మాజీ చాంపియన్ సన్ రైజర్స్ హైదరాబాద్ ఘోర పరాజయం పాలైంది. మంగళవారం గుజరాత్ టైటాన్స్ తో జరిగిన మ్యాచ్ లో 82 పరుగులతో ఓడిపోయింది. అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ లో టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 168 పరుగులు చేసింది. ఓపెనర్ సాయి సుదర్శన్ సూపర్బ్ ఫిఫ్టీ (44 బంతుల్లో 61, 5 ఫోర్లు, 2 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో ప్రఫుల్ హింగే, షకీబ్ హుస్సేన్ లకు తలో రెండు వికెట్లు దక్కాయి. అనంతరం ఛేజింగ్ లో సన్ బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. కేవలం 14.5 ఓవర్లలో 86 పరుగులకు ఆలౌటయ్యారు. పాట్ కమిన్స్ కెప్టెన్ ఇన్నింగ్స్ (19) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో కగిసో రబాడ, జేసన్ హోల్డర్ కు తలో మూడు వికెట్లు దక్కాయి. ఈ విజయంతో ఎనిమిదో విజయంతో గుజరాత్ టాప్ ప్లేస్ ను దక్కించుకుంది. ఇక బుధవారం జరిగే మ్యాచ్ లో కోల్ కతా నైట్ రైడర్స్ తో రాయల్ చాలేంజర్స్ బెంగళూరు తలపడనుంది. స్లో వికెట్ పై ఓ మాదిరి టార్గెట్ తో బరిలోకి దిగిన సన్ రైజర్స్ కు శుభారంభం దక్కలేదు. తొలి ఓవర్ వేసిన మహ్మద్ సిరాజ్ వణికించాడు. అతని బౌలింగ్ లో ఆడేందుకు తంటాలు పడిన ఓపెనర్ ట్రావిస్ హెడ్, ఆఖరికి నాలుగో బంతికి డకౌటయ్యాడు. ఆ తర్వాత ఆ ఓవర్ ను మెయిడిన్ చేసిన సిరాజ్.. శుభారంభం అందించాడు. అయితే రెండో ఓవర్ వేసిన రబాడ, సన్ కు పెద్ద షాకిచ్చాడు. సూపర్ ఫామ్ లో ఉన్న అభిషేక్ శర్మ (6)ను క్లీన్ బౌల్డ్ చేశాడు. నిజానికి కాస్త రూమ్ తీసుకుని ఆడదామని అభిషేక్ ట్రై చేయగా, అతడిని ఫాలో చేస్తూ, వేసిన బంతి, అభిషేక్ బ్యాట్ ను తాకి, నేరుగా వికెట్లను గిరాటేసింది. ఆ తర్వాత వరుస ఓవర్లలో ఇషాన్ కిషన్ (11), స్మరణ్ రవిచంద్రన్ (9) ను ఔట్ చేసి పెద్ద షాకిచ్చాడు. దీంతో ఇక్కడే ఫలితం దాదాపుగా తేలిపోయింది. ఇక పవర్ ప్లేలో కేవలం 34 పరుగులే చేసిన సన్.. టార్గెట్ ఛేదిస్తున్నట్లు ఎప్పుడూ అనిపించలేదు. క్రీజులో డేంజరస్ గా గడిపి, కొన్ని బౌండరీలు కొట్టిన సలీల్ ఆరోరా (16)ను తన తొలి ఓవర్లోనే ప్రసిధ్ కృష్ణ ఔట్ చేశాడు. ఇక తర్వాతి ఓవర్లోనే ఆదుకుంటాడనుకున్న హెన్రిచ్ క్లాసెన్ (14)ను హోల్డర్ పెవిలియన్ కు పంపడంతో సన్ కథ దాదాపుగా ముగిసి పోయింది. బ్యాటింగ్ ఆర్డర్లో చాలా వెనుకగా వచ్చిన తెలుగు కుర్రాడు నితీశ్ రెడ్డి (2) కూడా విఫలమయ్యాడు. ఆఖర్లో కమిన్స్ రెండు సిక్సర్లు, ఒక ఫోర్ బాదడంతో స్కోరు ఆ మాత్రమైన వచ్చింది. తను వెనుదిరిగాక ఆరెంజ్ ఆర్మీ పరాజయం ఖాయమైపోయింది. 3 వికెట్లు తీసిన రబాడకు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. ఇక 16 పాయింట్లు సాధించిన గుజరాత్ దాదాపుగా ప్లే ఆఫ్ బెర్త్ దక్కించుకున్నట్లేనని తెలుస్తోంది.

# అగ్రస్థానానికి చేరుకున్న రబడ



ఐపీఎల్ 2026 సీజన్‌లో సౌతాఫ్రికా స్పీడ్‌స్టర్ కగిసో రబడ తన ప్రతాపాన్ని కొనసాగిస్తున్నాడు. అహ్మదాబాద్ వేదికగా మంగళవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో రబడ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో ప్రత్యర్థి టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. ఈ మ్యాచ్‌లో తన కోటా 4 ఓవర్లలో కేవలం 28 పరుగులు మాత్రమే ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. ముఖ్యంగా కొత్త బంతితో రబడ వేసిన స్పెల్ ఈ సీజన్‌లోనే అత్యంత ప్రమాదకరమైనదిగా నిలిచింది. పవర్‌ప్లేలోనే అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, స్మరణ్ రవిచంద్రన్ వంటి కీలక బ్యాటర్లను పెవిలియన్ పంపి హైదరాబాద్ టీమ్‌ను కోలుకోలేని దెబ్బ తీశాడు. ఈ అదిరిపోయే ప్రదర్శనతో రబడ ఐపీఎల్ చరిత్రలో ఒక అరుదైన మైలురాయిని చేరుకున్నాడు. ఈ సీజన్ పవర్‌ప్లే ఓవర్లలో రబడ ఇప్పటివరకు మొత్తం 16 వికెట్లు సాధించాడు. తద్వారా ఒకే ఐపీఎల్ సీజన్ పవర్‌ప్లేలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో మిచెల్ జాన్సన్ (2013), ట్రెంట్ బౌల్ట్ (2020) రికార్డులను సమం చేశాడు. ప్రస్తుతం రబడ కంటే ముందు కేవలం మహమ్మద్ షమీ మాత్రమే ఉన్నాడు. షమీ 2023 సీజన్‌లో పవర్‌ప్లేలో 17 వికెట్లు పడగొట్టి టాప్‌లో ఉన్నాడు. రబడ ప్రస్తుత ఫామ్ చూస్తుంటే ఈ రికార్డును బ్రేక్ చేయడం పెద్ద కష్టమేమీ కాదనిపిస్తోంది. ప్రస్తుత 2026 సీజన్ పవర్‌ప్లే వికెట్ల చార్ట్‌లో కూడా రబడ అందరికంటే చాలా ముందున్నాడు. రబడ 16 వికెట్లతో అగ్రస్థానంలో ఉండగా, భువనేశ్వర్ కుమార్ 12 వికెట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. జోఫ్రా ఆర్చర్, మహమ్మద్ సిరాజ్ చెరో 9 వికెట్లతో తర్వాత స్థానాల్లో ఉన్నారు. రబడ ఎకానమీ కొంచెం ఎక్కువగా ఉన్నప్పటికీ, వికెట్లు తీయడంలో మాత్రం తనదైన మార్క్ చూపిస్తున్నాడు. వికెట్లు తీయడం వల్ల ప్రత్యర్థి టీమ్ రన్ రేట్‌ను కంట్రోల్ చేయడంలో రబడ సక్సెస్ అవుతున్నాడు. ఈ మ్యాచ్‌లో రబడ దెబ్బకు సన్‌రైజర్స్ బ్యాటర్లు క్రీజులో నిలదొక్కుకోవడానికి చాలా ఇబ్బంది పడ్డారు. పవర్‌ప్లే ముగిసేసరికి హైదరాబాద్ స్కోరు కేవలం 34/4 మాత్రమే. ఈ సీజన్‌లో సన్‌రైజర్స్‌కు ఇది రెండో అత్యల్ప పవర్‌ప్లే స్కోరు కావడం గమనార్హం. అలాగే పవర్‌ప్లేలోనే 4 వికెట్లు కోల్పోవడం హైదరాబాద్ టీమ్‌కు ఈ సీజన్‌లో ఇదే మొదటిసారి. అంతకుముందు గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లు సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్ హాఫ్ సెంచరీలతో రాణించి తమ జట్టుకు 168 పరుగుల గౌరవప్రదమైన స్కోరు అందించారు. ఆ తర్వాత టార్గెట్ ఛేజింగ్‌లో సన్‌రైజర్స్ సెటిల్ అవ్వకుండా రబడ ఆరంభం నుండే ఒత్తిడి పెంచాడు. ముందుగా అభిషేక్ శర్మను ఎక్స్‌ట్రా పేస్ ఇంకా బౌన్స్‌తో అవుట్ చేసిన రబడ, ఆ వెంటనే ఇషాన్ కిషన్‌ను తన ట్రాప్‌లో పడేసాడు. తన స్పెల్ మధ్యలో స్మరణ్ రవిచంద్రన్‌ను కూడా అవుట్ చేసి హైదరాబాద్ అగ్రెసివ్ బ్యాటింగ్ లైనప్‌ను కకావికలం చేసాడు. ఈ సీజన్ అంతటా రబడ తన రా పేస్, అక్యురేట్ లెంగ్త్ తో బ్యాటర్లను భయపెడుతున్నాడు. పిచ్ ఎలాంటిదైనా సరే తన బౌలింగ్‌తో వికెట్లు రాబట్టడం రబడకు వెన్నతో పెట్టిన విద్య. గుజరాత్ టైటాన్స్ దగ్గర ఐపీఎల్‌లోనే అత్యంత పవర్‌ఫుల్ పేస్ అటాక్ ఎందుకు ఉందో రబడ మరోసారి నిరూపించాడు.



# ప్యాట్ కమిన్స్‌పై బీసీసీఐ వేటు..

ఐపీఎల్ 2026లో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఘోర ఓటమి చవిచూసిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అహ్మదాబాద్‌లో జరిగిన ఈ పోరులో జట్టు ప్రదర్శనపై విమర్శలు వస్తుండగానే, కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌పై బీసీసీఐ భారీ జరిమానా విధించింది. స్లో ఓవర్ రేట్ కారణంగా కమిన్స్ ఈ శిక్షకు గురయ్యారు. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత సమయంలో ఓవర్లను పూర్తి చేయలేకపోయింది. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం.. స్లో ఓవర్ రేట్ తప్పిదానికి పాల్పడినందుకు కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌కు రూ.12 లక్షల జరిమానా విధిస్తున్నట్లు బీసీసీఐ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ సీజన్‌లో హైదరాబాద్ జట్టుకు ఇది మొదటి తప్పిదం కావడంతో కేవలం జరిమానాతో సరిపెట్టారు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం, ఒక కెప్టెన్ పదే పదే ఈ తప్పిదాన్ని పునరావృతం చేస్తే కఠిన చర్యలు ఉంటాయి. జరిమానా మొత్తం రూ.25 లక్షలు దాటితే కెప్టెన్‌కు ఒక డీమెరిట్ పాయింట్ ఇస్తారు. అయితే 2025 సీజన్ నుంచి వచ్చిన మార్పుల ప్రకారం.. ఓవర్ రేట్ తప్పిదాల వల్ల నేరుగా నిషేధం విధించరు. ఒకవేళ ఒక సీజన్‌లో 5 డీమెరిట్ పాయింట్లు వస్తేనే సదరు కెప్టెన్ లేదా ఆటగాడిపై ఒక మ్యాచ్ నిషేధం పడే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం కమిన్స్ కేవలం ఒకసారే ఈ తప్పిదం చేశారు కాబట్టి ఆయన ఆడేందుకు ఎలాంటి అడ్డంకులు లేవు.కావ్య మారన్ నేతృత్వంలోని సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్రస్తుతం 12 మ్యాచ్‌లలో 14 పాయింట్లతో పాయింట్ల పట్టికలో మూడవ స్థానంలో ఉంది. గుజరాత్ చేతిలో 82 పరుగుల తేడాతో ఓడిపోవడం జట్టు నెట్ రన్ రేట్‌పై ప్రభావం చూపింది. ప్లేఆఫ్స్ రేసులో ఉన్న సన్‌రైజర్స్‌కు ఇప్పుడు కెప్టెన్‌పై జరిమానా పడటం మానసికంగా కొంత ఇబ్బంది కలిగించే విషయమే. ఇదే సీజన్‌లో శ్రేయాస్ అయ్యర్ ఇప్పటికే రెండుసార్లు జరిమానా కట్టి రూ.36 లక్షలు చెల్లించడం గమనార్హం. రూ. 14 కోట్లకు రిటైన్ చేసుకున్న ప్యాట్ కమిన్స్, తదుపరి మ్యాచ్‌లలో జట్టును సమయానికి ఓవర్లు వేయించేలా నడిపించాల్సి ఉంటుంది. రాబోయే మ్యాచ్‌లలో మళ్ళీ ఈ పొరపాటు జరిగితే జరిమానా పెరగడమే కాకుండా డీమెరిట్ పాయింట్లు వచ్చే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఓటమితో డీలా పడ్డ కావ్య మారన్ సేన, ఈ నిబంధనల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



# అర్ధరాత్రి 1:30కు హార్దిక్ ప్రాక్టీస్

ఈ ఐపీఎల్ సీజన్ ముంబై ఇండియన్స్ ఏ మాత్రం కలిసిరాలేదు. వరుస మ్యాచ్ లల్లో ఓటమి పాలైన ఈ మోస్ట్ సక్సెస్ ఫుల్ టీమ్.. ఇప్పటికే ప్లేఆఫ్స్ నుంచి అవుట్ అయింది. దానికి తోడు కేప్టెన్ హార్దిక్ పాండ్యా వివాదాల్లో చిక్కుకున్నాడు. నడుం నొప్పి, జట్టు యాజమాన్యంతో విభేదాలు, కెప్టెన్సీ విషయంలో విమర్శలు.. ఇలా ముప్పేట దాడిని ఎదుర్కొంటోన్నాడు.నడుం నొప్పితో ఐపీఎల్ లో మిగిలిన మ్యాచ్ లకు దూరం అవొచ్చనే వార్తలకు తాజాగా చెక్ పెట్టాడు హార్దిక్ పాండ్యా. తన తాజా వీడియోతో వాటన్నింటికీ ఫుల్ స్టాప్ పెట్టాడు. ధర్మశాల వేదికగా గురువారం పంజాబ్ కింగ్స్‌తో జరగనున్న మ్యాచ్‌కు ముందు.. తాను పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నాని నిరూపించుకునే ప్రయత్నం చేస్తోన్నాడు. ముంబైలో అర్ధరాత్రి 1:30 గంటలకు నెట్ సెషన్స్ లో కనిపించాడు హార్దిక్. బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు. తనదైన శైలిలో భారీ షాట్లు ఆడాడు. ముంబై ఇండియన్స్ ఆడిన చివరి రెండు మ్యాచ్‌లకు హార్దిక్ పాండ్యా నడుము నొప్పి కారణంగా దూరమయ్యాడు.

# వైభవ్ సూర్యవంశీకి ఏబీ డివిలియర్స్ ఛాలెంజ్!



భారత క్రికెట్లో ప్రస్తుతం సెన్సేషన్‌గా మారిన 15 ఏళ్ల యువ కెరటం వైభవ్ సూర్యవంశీ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. ఐపీఎల్ 2025లో రాజస్థాన్ రాయల్స్ తరఫున అరంగేట్రం చేసినప్పటి నుంచి విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి దిగ్గజాల మధ్య కూడా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. అద్భుతమైన హిట్టింగ్ సామర్థ్యం ఉన్న వైభవ్ ప్రతిభను మైఖేల్ వాన్, అలిస్టర్ కుక్ వంటి మాజీలు కొనియాడారు. త్వరలోనే వైభవ్ భారత సీనియర్ జట్టులోకి వస్తాడని అంతా భావిస్తున్నారు.అయితే ఆర్సీబీ లెజెండ్ ఏబీ డివిలియర్స్ మాత్రం వైభవ్ సూర్యవంశీ భవిష్యత్తుపై భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. స్టువర్ట్ బ్రాడ్, జోస్ బట్లర్ నిర్వహించిన 'ఫర్ ది లవ్ ఆఫ్ క్రికెట్' పాడ్‌కాస్ట్‌లో ఏబీ డివిలియర్స్ మాట్లాడుతూ.. వైభవ్ సూర్యవంశీ కెరీర్ సుదీర్ఘంగా సాగాలంటే అతను కేవలం టీ20లకు మాత్రమే పరిమితం కాకూడదని సూచించారు. "వైభవ్‌లో అద్భుతమైన ప్రతిభ ఉంది, కానీ అతను ఎక్కువ కాలం రాణించగలడా అనే దానిపై నాకు అనుమానం ఉంది" అని ఏబీ డివిలియర్స్ స్పష్టం చేశాడు.ఏబీడీ దృష్టిలో టీ20 క్రికెట్, టెస్ట్ క్రికెట్ మధ్య చాలా తేడా ఉంటుంది. వైభవ్ సూర్యవంశీ తనను తాను కేవలం టీ20 స్పెషలిస్ట్‌గా మార్చుకుంటే అతని కెరీర్ విజయవంతంగా సాగుతుందని.. కానీ వన్డేలు, టెస్టుల్లోకి అడుగుపెడితే మాత్రం కఠినమైన సవాళ్లు ఎదురవుతాయని హెచ్చరించాడు. టెస్ట్ క్రికెట్‌లో మానసిక, శారీరక దృఢత్వం చాలా అవసరమని.. అక్కడ ఎదురయ్యే అడ్డంకులను అధిగమించడం అంత సులభం కాదని ఆయన అభిప్రాయపడ్డాడు. "వైభవ్ సూర్యవంశీకి అన్ని రకాల షాట్లు ఆడే సత్తా ఉంది, కానీ టెస్ట్ క్రికెట్ ఆడేటప్పుడు అతను తనలోని కొత్త కోణాన్ని కనుగొనాల్సి ఉంటుంది. అది ఒక గంభీరమైన ప్రయాణం లాంటిది. అతను ఆ సవాళ్లను దాటుకుని తన దేశం తరపున టెస్టులు ఆడాలని నేను కోరుకుంటున్నాను" అని డివిలియర్స్ ముగించాడు. మరి ఈ 15 ఏళ్ల వండర్ కిడ్, ఏబీడీ విసిరిన ఈ సవాల్‌ను స్వీకరించి భవిష్యత్తులో అన్ని ఫార్మాట్లలో రాణిస్తాడో లేదో వేచి చూడాలి.

## ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ కు

# నట్టికుమార్ రాజీనామా..

## కౌన్సిల్ తీరుపై విమర్శలు




తెలంగాణ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ జాయింట్ సెక్రటరీ పదవికి నిర్మాత నట్టి కుమార్ రాజీనామా చేశారు. కేవలం పదవిని వదులుకోవడమే కాకుండా, కౌన్సిల్ పనితీరులోని లోపాలను ఎత్తిచూపుతూ లేఖ రాశారు. నట్టి కుమార్ తన రాజీనామా లేఖలో కౌన్సిల్ నిర్వహణపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. ముఖ్యంగా నిర్మాతలు, ఎగ్జిబిటర్ల మధ్య ఉండాల్సిన పర్సంటేజీ విధానం అమలులో కౌన్సిల్ పూర్తిగా విఫలమైందని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల చిన్న, మధ్యతరగతి నిర్మాతలు తీవ్రంగా నష్టపోతున్నారని, ఎగ్జిబిటర్ల ఆధిపత్యం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కౌన్సిల్ నిర్ణయాల్లో పారదర్శకత లేదని, కార్యవర్గ సభ్యులకు సమాచారం ఇవ్వకుండానే సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆయన విమర్శించారు.ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరగడం లేదని... ఆడిటింగ్, ఆర్థిక నిర్వహణలో జవాబుదారీతనం లోపించిందని నట్టి కుమార్ లేఖలో వెల్లడించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి కూడా తాను ఏమీ చేయలేనప్పుడు ఆ పదవిలో కొనసాగడం అర్థరహితమని ఆయన పేర్కొన్నారు. తన రాజీనామా తర్వాతైనా సభ్యులందరూ మేల్కొని, సంస్థను పారదర్శకంగా నడిపించాలని ఆయన కోరారు.

# అవతార్-3... ఓటీటీ స్ట్రీమింగ్ కు రెడీ!



జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన అవతార్-3 ఫైర్ అండ్ యాష్ గత ఏడాది డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సినిమా త్వరలో అంతర్జాతీయ ఓటీటీలోకి రానుంది. డిస్నీప్లస్ వేదికగా జూన్ 24వ తేదీన ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుందని వెల్లడిస్తూ, నిర్మాణ సంస్థ పోస్టర్‌ను విడుదల చేసింది.అవతార్-3 చిత్రం థియేటర్లలో మంచి వసూళ్లను రాబట్టింది. వాస్తవానికి ఈ చిత్రం ఇప్పటికే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో రెంటల్ ప్రాతిపదికన అందుబాటులో ఉంది.
జూన్ 24వ తేదీ నుంచి సబ్‌స్క్రిప్షన్ ఉన్న వినియోగదారులకు ఎలాంటి అదనపు రుసుము చెల్లించాల్సిన అవసరం లేకుండా సినిమాను వీక్షించవచ్చు.
అవతార్-3 భారతదేశంలో జూన్ 24వ తేదీనే జియో హాట్‌స్టార్‌లో అందుబాటులోకి రానుందని తెలుస్తోంది. తెలుగు, హిందీ, తమిళం తదితర భాషల్లో ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. భారతదేశంలో ఈ సినిమా ఓటీటీ విడుదలపై ప్రకటన రావాల్సి ఉంది.



## నోరా కిల్లింగ్ లుక్

# : కాసులు, నాణేలతో ఒళ్లంతా సింగారం

గ్లోబల్ డాన్సింగ్ సెన్సేషన్ నోరా ఫతేహి తన సరికొత్త ఫోటోషూట్‌తో ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. "నీ ఒళ్లు బంగారం కాను..!" అనేలా మెరిసిపోతున్న ఆ దివ్యమైన రూపం అభిమానుల కళ్లను తిప్పుకోనివ్వడం లేదు. భారతీయ సంప్రదాయ ఆభరణాలు... ఉత్తర ఆఫ్రికా సంస్కృతుల అరుదైన కలయికతో రూపొందించిన ఈ లుక్ నోరా కెరీర్‌లోనే అత్యంత ప్రయోగాత్మకమైన.. అందమైన ఫోటోషూట్‌లలో ఒకటిగా నిలుస్తోంది. ఈ ఫోటోషూట్ వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం ఒక -జల దేవత- రూపానికి ప్రాణం పోయడం. ఇందులో భాగంగా నోరా శరీరం నిండా బంగారు కాసులు, నాణేలతో కూడిన ఆభరణాల దుస్తులను డిజైన్ చేయించడం ఆసక్తిని కలిగించింది. ఈ గోల్డ్ జ్యువెలరీ ఈ బ్యూటీకి ఒక రాజసం ఉట్టిపడే భారతీయ సౌందర్యాన్ని అందించింది. నోరా నిజంగా ఒక దేవతలా వెలిగిపోతోంది. కేవలం భారతీయతకే పరిమితం కాకుండా.. ఈ లుక్‌లో నోరా తన మూలాలను కూడా ప్రతిబింబించింది. మొరాకోకు చెందిన -అమాజిగ్ బెర్బర్- సంస్కృతికి చెందిన బాడీ టాటూలను ఇందులో జోడించారు. ఈ టాటూలు, బంగారు ఆభరణాల కలయిక భారత్ - మొరాకో అనే రెండు భిన్నమైన ప్రపంచాల అద్భుతమైన సమ్మేళనంలా కనిపిస్తోంది. ఈ -ఫ్యూషన్- స్టైల్ నోరా ఫ్యాషన్ సెన్స్‌కు నిదర్శనంగా నిలుస్తోంది. నోరా ఫతేహి తన ఫిట్‌నెస్ -గ్రేస్‌తో ఈ లుక్‌కు పూర్తి న్యాయం చేసింది. కేవలం డ్యాన్స్‌లోనే కాదు.. ఫ్యాషన్ ప్రయోగాల్లోను తనే -క్వీన్- అని చాటుకుంది. సోషల్ మీడియాలో ఈ ఫోటోలు వైరల్ అవుతుండటంతో.. నెటిజన్లు నోరా అందానికి .. ఆ వినూత్న ఆలోచనకు ఫిదా అయిపోతున్నారు.






# స్టైల్‌లో తగ్గేదేలే..

### జెన్-జీ ఫ్యాషన్‌తో మెస్మరైజ్ చేస్తున్న మెగాస్టార్.. బాస్ సరికొత్త లుక్ వైరల్!

త్వరలో బాబీ కొల్లి దర్శకత్వంలో కొత్త సినిమా షూటింగ్ ప్రారంభం మెగాస్టార్ చిరంజీవి వయసును వెనక్కి నెడుతూ సరికొత్త లుక్‌తో అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. గతంలో కంటే మరింత స్లిమ్‌గా, ఎంతో ఉత్సాహంగా కనిపిస్తున్న ఆయన తాజా ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కఠినమైన క్రమశిక్షణ, నిరంతర శ్రమతో ఆయన తన ఫిట్‌నెస్‌ను ఎలా కాపాడుకుంటున్నారో ఈ లుక్ స్పష్టం చేస్తోంది. వ్యక్తిగతంగానూ ఆయనలోని ఆకర్షణ ఏమాత్రం తగ్గలేదని, యంగ్ లుక్‌తో అభిమానులను ఫిదా చేస్తున్నారని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి.ప్రస్తుత తరం ఫ్యాషన్‌కు ఏమాత్రం తీసిపోని విధంగా, జెన్-జీ ప్రేరణతో కూడిన ట్రెండీ దుస్తులను చిరంజీవి అలవోకగా ధరిస్తున్నారు. ఆయన స్టైల్ ఎప్పటికీ ప్రత్యేకమేనని నిరూపిస్తున్నారు. సమకాలీన డ్రెస్సింగ్ అయినా, మోడరన్ ఎస్తటిక్స్ అయినా.. ప్రతి లుక్‌ను 'బాస్' మాత్రమే క్యారీ చేయగల ప్రత్యేకమైన స్వాగ్‌తో ప్రదర్శిస్తున్నారు.ఒకవైపు తన లుక్‌తో వార్తల్లో నిలుస్తూనే, మరోవైపు తన తదుపరి సినిమా కోసం ఆయన సిద్ధమవుతున్నారు. త్వరలోనే దర్శకుడు బాబీ కొల్లితో చేయబోతున్న కొత్త సినిమా షూటింగ్‌లో చిరంజీవి పాల్గొననున్నారు. ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది.

# సిల్వర్ గౌనులో దేవకన్యలా ఊర్వశి రౌతేలా..

### కేన్స్‌లో మరోసారి తన మార్క్ చూపిన బ్యూటీ!



ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 79వ ఎడిషన్ అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఫ్రాన్స్‌లోని ఫ్రెంచ్ రివేరాలో మే 12 నుంచి 23 వరకు జరిగే ఈ వేడుకకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ, ఫ్యాషన్ ప్రముఖులు హాజరయ్యారు. అలియా భట్, డెమీ మూర్ వంటి తారలు ప్రారంభోత్సవంలో తమ స్టైల్‌తో ఆకట్టుకోగా, బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా తనదైన ప్రత్యేకమైన డ్రెస్సింగ్ స్టైల్‌తో రెడ్ కార్పెట్‌పై ప్రధాన ఆకర్షణగా నిలిచారు.
ప్రారంభోత్సవం కోసం ఊర్వశి వియత్నాంకు చెందిన ఫ్యాషన్ లేబుల్ 'జోలీపోలీ' డిజైన్ చేసిన కస్టమ్ కౌచర్ గౌనును ఎంచుకున్నారు. లావెండర్ రంగు బేస్‌పై భారీ సిల్వర్ అలంకరణతో ఉన్న ఈ గౌను చూడగానే కట్టిపడేసింది. క్రిస్టల్స్, సీక్విన్స్, పూసలు, రాళ్ల వర్క్‌తో గౌను మొత్తం కేన్స్ లైట్ల వెలుగులో తళతళా మెరిసింది. మత్స్యకన్య ఆకారాన్ని పోలి ఉన్న ఈ గౌను ఆమె అందాన్ని రెట్టింపు చేసింది.
ఈ డ్రెస్ ప్రత్యేకతల్లో కార్సెట్ తరహాలో ఉన్న బాడీస్ ఒకటి. గౌనుపై శిల్పం చెక్కినట్టుగా వెండి ఎంబ్రాయిడరీతో సున్నితమైన డిజైన్లు ఉన్నాయి. స్వీట్‌హార్ట్ నెక్లైన్‌తో పాటు భుజాల వద్ద ఉన్న అలంకరణలు డ్రెస్‌కు మరింత ఆకర్షణను తెచ్చిపెట్టాయి. పొడవైన కేప్ స్లీవ్స్, వాటికి వేలాడుతున్న క్రిస్టల్ టాసెల్స్... వెండి రెక్కలు తొడుక్కున్నట్టుగా ఆకర్షించాయి.
"ఐసీ సిల్వర్" థీమ్‌కు తగ్గట్టుగానే ఊర్వశి ఆభరణాలను ధరించారు. స్టేట్‌మెంట్ చోకర్ నెక్లెస్, దానికి సరిపోయే చెవిపోగులు, బ్రేస్‌లెట్‌తో పాటు జుట్టు ముడి మధ్యలో పక్షి ఆకారంలో ఉన్న మాంగ్ టిక్కా తరహా తల ఆభరణం అందరి దృష్టినీ ఆకర్షించింది. గౌను మొత్తం ఒకే రంగులో ఉన్నప్పటికీ, ఆమె చేతిలో పట్టుకున్న రంగురంగుల రాళ్లు, అద్దాలతో పొదిగిన బాక్స్ క్లచ్ ప్రత్యేకంగా నిలిచింది. ఇక పూర్తి గ్లామ్ మేకప్‌తో ఊర్వశి మరింత ప్రకాశవంతంగా కనిపించారు. సిల్వర్ షిమ్మర్ ఐస్, నిగనిగలాడే పెదవులు, ముఖానికి ఫ్రేమ్‌లా ఉన్న హెయిర్‌స్టైల్‌తో తన లుక్‌ను పూర్తి చేశారు.

# ఈ నెల 23న భోపాల్ లో 'పెద్ది' రీసౌండ్ ఖాయం!



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న భారీ చిత్రం 'పెద్ది' నుంచి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న అప్‌డేట్ వచ్చేసింది. సినిమా ప్రమోషన్లకు ఒక గ్రాండ్ మ్యూజికల్ ఈవెంట్‌తో కిక్ ఇచ్చేందుకు చిత్రబృందం సిద్ధమైంది. ఈ మేరకు మే 23న మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారికంగా ప్రకటించింది.
'సౌండ్ ఆఫ్ పెద్ది' పేరుతో జరగనున్న ఈ ఈవెంట్‌లో భాగంగా సినిమాలోని ఒక ప్రత్యేక గీతాన్ని పరిచయం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య ఆకర్షణగా సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ నిలవనున్నారు. ఆయన ఈ వేదికపై లైవ్ పెర్ఫార్మెన్స్ ఇవ్వనున్నట్లు మేకర్స్ తెలిపారు. దీంతో ఈ ఈవెంట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి.
బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాలో రామ్ చరణ్‌కు జోడీగా జాన్వీ కపూర్ నటిస్తోంది. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్‌తో పాటు జగపతి బాబు, బొమన్ ఇరానీ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ స్పష్టం చేసింది. భోపాల్ ఈవెంట్‌తో సినిమా ప్రచార కార్యక్రమాలు ఊపందుకుంటాయని ఫ్యాన్స్ భావిస్తున్నారు.కాగా, మే 18న పెద్ది ట్రైలర్ రిలీజ్ అవుతున్న సంగతి తెలిసిందే. ముంబైలో పెద్ది ట్రైలర్ లాంచ్ ఈవెంట్ గ్రాండ్ గా నిర్వహించనున్నారు. దీంతో ఈ చిత్రం ప్రమోషన్స్ అధికారికంగా ప్రారంభం కానున్నాయి.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613